సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
శనివారం
2 ఆగస్టు, 2025
సంపుటి: 21 సంచిక: 112
పేజీలు: 8 వెల: రూ.1







# అన్నదాతకు డబుల్ సంక్షేమం
# రెట్టింపు సంతోషం

బాబు సూపర్ 6



**సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చడంలో భాగంగా**
**'అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్' పథకానికి నేడు శ్రీకారం**
**రాష్ట్రంలోని 46.86 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.3,174.43 కోట్లు జమ**

గౌ॥ భారత ప్రధాని
## శ్రీ నరేంద్ర మోదీ గారి సహకారంతో...

గౌ॥ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి
## శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారిచే
## 'అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్' పథకం ప్రారంభం

**వేదిక**
దర్శి, ప్రకాశం జిల్లా

**తేదీ & సమయం**
02 ఆగస్టు, 2025, 1 PM




అర్హులైన ప్రతి రైతుకు
**ప్రతి ఏటా**
**రూ.20,000**
**ఆర్థిక సహాయం**

నేడు మొదటి విడతలో
**రూ.7,000 జమ**
2వ విడత మరో రూ.7,000,
3వ విడత రూ.6,000

**గతంలో ఇచ్చిన రూ.13,500 కంటే రూ.6,500 ఎక్కువ**



**అన్నదాతల కుటుంబాల్లో ఆనందమే కూటమి ప్రభుత్వానికి ఆశీర్వచనం**

• ఎడిటోరియల్

# అందుకే భారత్‌పై ట్రంప్ అక్కసు!

ఒకవైపు స్నేహం అంటూనే.. మరోవైపు మంట పెడతున్న ట్రంప్ తీరు ఒక్క భారతదేశాన్నే కాక చాలా ప్రపంచ దేశాలను విస్మయానికి గురిచేస్తోంది. 'భారత్ మాకు మిత్రదేశమే.. మోదీ నా ఫ్రండే.. కానీ రష్యా నుంచి ఆయిల్, ఆయుధాలు కొనుగోలు చేస్తోంది కాబట్టి 25 శాతం సుంకాలు విధిస్తున్నాం' అని ప్రకటించిన ట్రంప్.. అదే సమయంలో ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌తో వాణిజ్య ఒప్పందం చేసుకోవడమే కాకుండా చమురు వెలికితీతకు ఆ దేశంతో కలిసి పని చేస్తామని ప్రకటించడం విడ్డూరంగా ఉంది. రెండోసారి అధ్యక్ష పగ్గాలు చేపట్టిన తర్వాత ట్రంప్ పలు భారత వ్యతిరేక నిర్ణయాలు తీసుకున్నారు. జన్మతః పౌరసత్వం రద్దు, అక్రమ వలసదారులను వెనక్కిపంపడం, వీసా నిబంధనలు కఠినతరం చేయడం, దిగుమతులపై సుంకాలు విధించడం, పాకిస్తాన్‌కు ప్రాధాన్యత ఇవ్వడం వంటివన్నీ భారత్‌కు ఇబ్బంది కలిగించేవే. ట్రంప్ ఇలా వ్యవహరించడానికి కారణం తన మాటలను భారత నాయకత్వం పట్టించుకోకపోవడం, తన పెత్తనాన్ని అంగీకరించకపోవడమే. మరోవైపు చైనా, భారత్ సభ్యులుగా ఉన్న బ్రిక్స్ కూటమి బలపడుతుండటం ట్రంప్‌కు కంటగింపుగా మారింది. అందుకే గత కొన్నాళ్లుగా భారత వ్యతిరేక వైఖరిని అవలంభిస్తున్నారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాక్‌లో ఉగ్ర శిబిరాలే లక్ష్యంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌ను తానే అడ్డుకున్నానని.. భారత్ తన హెచ్చరికలను ఔదల దాల్చిందని సంధు దొరికినప్పుడల్లా ట్రంప్ ప్రచారం చేసుకున్నారు. ఆ క్రెడిట్ మొత్తాన్ని తానే కొట్టేయాలని తెగ తాపత్రయపడ్డారు. అయితే భారత్ ట్రంప్ ప్రచారాన్ని నిర్ద్వంద్వంగా ఖండించింది. ఆపరేషన్ సింధూర్ నిలిపివేయడం వెనుక ఎవరి ప్రమేయం లేదని, పాక్ కాళ్లబేరానికి రావడం వల్లే పాక్‌పై సైనిక చర్యను నిలిపామని పార్లమెంటు సాక్షిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టంగా ప్రకటించారు. అయితే నోబెల్ శాంతి బహుమతి కోసం తెగ ప్రయత్నిస్తున్న ట్రంప్ భారత వైఖరిని తట్టుకోలేకపోతున్నారు. ట్రంప్ అక్కసుకు మరో కారణం రష్యాతో వాణిజ్య బంధం. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడం అమెరికాతో పాటు పశ్చిమ దేశాలకు ఏమాత్రం ఇష్టం లేదు. రష్యా నుంచి ఎస్ 400 డిఫెన్స్ సిస్టమ్ కొనుగోలు చేస్తే ఆంక్షలు విధిస్తామని కూడా అమెరికా గతంలో హెచ్చరించింది. అయినా భారత్ వెనక్కి తగ్గలేదు. తనతో దోస్తీ కొనసాగాలంటే రష్యాను భారత్ పూర్తిగా పక్కనపెట్టాలని అమెరికా కోరుకుంటోంది. కానీ రష్యాతో దశాబ్దాలుగా ఉన్న స్నేహాన్ని వదులుకునేందుకు భారత్ సిద్ధంగా లేదు. అలీన విధానానికి కట్టుబడిన భారత్.. రష్యాతో సహా అన్ని దేశాలతోనూ స్నేహ సంబంధాలు కొనసాగిస్తోంది. అమెరికా వెనకాల నిలబడ్డానికి అంగీకరించడంలేదు. అమెరికాను భయపెడుతున్న మరో అంశం బ్రిక్స్. భారత్, చైనా, రష్యా, బ్రెజిల్, సౌతాఫ్రికా తదితర దేశాల కలయికతో ఏర్పడిన బ్రిక్స్ కూటమి తనకు వ్యతిరేకమని, డాలర్ ఆధిపత్యానికి గండికొట్టడానికే అది ఏర్పడిందని అమెరికా అనుమానిస్తోంది. అందుకే బ్రిక్స్ కూటమిపై ట్రంప్ బెదిరింపు ధోరణితో పలు సందర్భాల్లో వ్యాఖ్యలు చేశారు. రష్యా, చైనా ఎలాగూ తనకు వ్యతిరేకం కాబట్టి మిగిలిన భారత్, బ్రెజిల్, సౌతాఫ్రికా తదితర దేశాలను తనవైపు తిప్పుకోవాలని అమెరికా ప్రయత్నిస్తోంది. అందులో భాగంగానే టారిఫ్‌లు, వీసా ఆంక్షలు, నిధుల నిలిపివేత వంటి చర్యలతో ఒత్తిడి పెంచుతోంది. వాటితోపాటు ఇండియాను బెదిరించి తనవైపు తిప్పుకొనేందుకు పాకిస్తాన్‌ను మళ్లీ దువ్వడం మొదలుపెట్టింది. అందుకే భారత్‌పై 25 శాతం సుంకాల విధింపు ప్రకటన చేసిన వెంటనే పాకిస్తాన్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నామని ప్రకటించడంతో పాటు.. ఆ దేశంలో గుర్తించిన భారీ చమురు నిక్షేపాల నుంచి చమురు వెలికి తీసేందుకు ఇస్లామాబాద్‌తో కలిసి పని చేస్తామని ట్రంప్ ప్రకటించారు. అంటే భారత్‌ను బెదిరించడంతో పాటు పాకిస్తాన్‌లోని చమురు నిక్షేపాలపైనా అమెరికా కన్నేసిందన్నమాట. భారత మార్కెట్లోకి తమ వ్యవసాయ, పాల ఉత్పత్తులను ప్రవేశపెట్టాలని ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. కానీ భారత పాడి పరిశ్రమను తీవ్రంగా దెబ్బతీసే ఆ ప్రతిపాదనను ఎంత ఒత్తిడి చేసినా భారత్ తిరస్కరించింది. బ్రిక్స్ దేశాలపై ఒత్తిడి పెంచుతున్నామనుకుంటున్న ట్రంప్.. ఆ క్రమంలో ఆయనే భారత్‌ను చైనా, రష్యాలకు మరింత చేరువ చేస్తున్నారు. ఒకవేళ ట్రంప్ బెదిరింపులు బెడిసి కొట్టి భారత్, చైనాలు కలిస్తే మాత్రం అమెరికాకు చుక్కలు కనిపించడం ఖాయం!

# ప్లాస్టిక్ రహిత నగరంగా శ్రీకాకుళం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అక్టోబర్ 2 నాటికి ప్లాస్టిక్ రహిత శ్రీకాకుళం నగరాన్ని ప్రజలు చూడబోతున్నారని, ఒకసారి వినియోగించే ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఇప్పటికే కలెక్టర్ కార్యాలయాన్ని పూర్తిగా ప్లాస్టిక్ రహితంగా మార్చామని, ప్లాస్టిక్ భూమిలో కలిసేందుకు కనీసం 200ఏళ్లు పడుతుందని, అందుకే ఇది అత్యవసరమైన చర్య అని ఆయన చెప్పారు. శుక్రవారం ఆయన డిసిసిబి కాలనీ, చాపురం ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. దాదాపు రెండు గంటల పాటు నగరంలో తిరిగి పలు ప్రాంతాల్లో పరిశీలించారు. కాలువలు శుభ్రంగా లేకపోవడంపై కలెక్టర్ సిబ్బందిని ప్రశ్నించారు. ప్రతీ ఇంటికి ర్యాంపులు క్రమపద్ధతిలో లేకపోవడాన్ని ప్రణాళిక విభాగం దృష్టికి తీసుకొచ్చారు. రోడ్లపై భవన నిర్మాణ మేటిరియల్, డెబ్రిస్ వేయొద్దని సూచించారు. భారీ వర్షాలు పడితే కాలువలు పొంగి పొర్లే అవకాశం ఉండటంతో ఇప్పటికే పూడిక ఎత్తివేయాలని సిబ్బందికి సూచించారు. రోడ్లపై నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది, ప్రభుత్వ విభాగాల అధికారులు కలిసి సమన్వయంతో పని చేయాలని పలు సూచనలు చేశారు. పరిశుభ్రత విషయంలో పట్టణాన్ని పూర్తి స్థాయిలో శుభ్రంగా ఉంచాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పర్యటనలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ రావు, సంబంధిత శాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

# అక్షర ఆంధ్ర విజయవంతం చేయాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



జిల్లాలో అక్షరాస్యత శాతం పెంపునకు లక్ష్యంగా అమలు చేస్తున్న అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. దూరదర్శన (జూమ్) ద్వారా శుక్రవారం ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని 1,12,071 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చే విధంగా కార్యాచరణ రూపొందించామన్నారు. గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా 66,000 మంది, గ్రామీణ ఉపాధి హామీ సంస్థ ద్వారా 36,000 మంది, పట్టణ అభివృద్ధి సంస్థ ద్వారా 9,000 మందికి వయోజన విద్య వాలంటీర్లను 1:10 నిష్పత్తిలో ఎంపిక చేయాలని సూచించారు. వారు స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలు, సంఘాల భవనాల్లో అక్షరాస్యత తరగతులు నిర్వహించాల్సి ఉంటుందని చెప్పారు. జిల్లా స్థాయిలో జడ్పీ ముఖ్య కార్యనిర్వాహక అధికారి, జిల్లా ప్రణాళిక అధికారి, గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు, ఉపాధి హామీ సంస్థ పథక సంచాలకులు, పట్టణ అభివృద్ధి సంస్థ పథక సంచాలకులు, జిల్లా విద్యాధికారి, బాలల అభివృద్ధి సంస్థ అధికారి మొదలైన వారు సమితి సభ్యులుగా ఉంటారు. మండల స్థాయిలో ఎంపీడీఓ, పాఠశాల విద్యాధికారి, గ్రామీణాభివృద్ధి సంస్థ పథకాల సహాయకులు, ఉపాధి హామీ సంస్థ అభివృద్ధి అధికారి, బాలల అభివృద్ధి అధికారి, వయోజన విద్య పర్యవేక్షకులు సభ్యులుగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమానికి వయోజన విద్య ఉప సంచాలకుడు ముద్దాడ వెంకటరమణ సభ్య కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తారని చెప్పారు.

సమావేశంలో జడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా, గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు ఎం. కిరణ్ కుమార్, ఉపాధి హామీ పథక సంచాలకులు సుధాకర్‌రావు, పట్టణ అభివృద్ధి సంచాలకులు ఎస్.వి.రమణ, జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్య తదితరులు జూమ్ ద్వారా పాల్గొన్నారు.

## జల్ జీవన్ మిషన్ పనులు వేగవంతం చేయాలి

(సత్యంన్యూస్, రణస్థలం)

జల్‌జీవన్ మిషన్ పనులు వేగవంతం చేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడికుదిటి ఈశ్వరరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆర్డబ్ల్యుఎస్ అధికారులతో జలజీవన్ మిషన్ కార్యక్రమ అమలు పురోగతిపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఉన్న ప్రతి ఇంటికీ తాగునీరు సరఫరే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంపై పని ప్రగతిని సమీక్షిస్తూ వేగవంతం చేసి పనుల నాణ్యతపై అధికారులను ఆదేశించారు. ఎలాంటి ఆలస్యం లేకుండా పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో డిఈ దుర్యోధన రావు, నాలుగు మండలాల జెఈలు, ముప్పిడి సురేష్, కుమారాపు రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.



## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా సెప్టెంబర్ 5న జరగనున్న ఉపాధ్యాయ దినోత్సవ (గురుపూజోత్సవం) సందర్భంగా రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇవ్వనున్న సందర్భంలో అర్హులైన ఉపాధ్యాయుల నుండి దరఖాస్తులు కోరుతున్నామని ఇన్‌చార్జి డిఇఒ ఎం.శ్రీనివాస రావు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు ఈనెల 8లోగా సంబంధిత మండల విద్యాశాఖాధికారుల వద్ద నేరుగా సమర్పించాలన్నారు. అవార్డుల కోసం మూడు విభాగాలలో దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు అర్హులైన ఉపాధ్యాయులను ఐదుగురు సహోపాధ్యాయులు సిఫారసు చేయాలని సూచించారు. మండల విద్యాశాఖ అధికారులు అర్హులైన దరఖాస్తులను పరిశీలించి, సంబంధిత ప్రతిపాదనలను జిల్లా స్థాయికి పంపిస్తే, ఉప విద్యాశాఖాధికారులు తమ డివిజనల్ పరిధిలో డివిజినల్ స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి ఎంపిక చేసిన ఉపాధ్యాయుల వివరాలను జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. సవివరమైన మార్గదర్శకాలు మరియు దరఖాస్తు నమూనాలు అన్ని మండల విద్యాశాఖాధికారుల వద్ద, జిల్లా వెబ్‌సైట్‌లో లభ్యమవుతాయన్నారు.

# నౌషద్ ఆఫ్ ఇండియా.. ఘంటసాలకూ ఆరాధ్యుడు!!



**నౌషాద్ ఆఫ్ సౌత్ ఇండియా.. దక్షిణాది సినీ సంగీతానికి గ్లామర్ తెచ్చిన సంగీత దర్శకుడు చింతామణి రామ సుబ్బరామన్. తెలుగు నేల నుంచి తమిళనాడుకు వలస వెళ్లిన కుటుంబానికి చెందిన సుబ్బరామన్ ఆ రోజుల్లో స్టార్ మ్యూజిక్ డైరక్టర్ అనిపించుకున్నాడు. చిన్నతనం నుంచి సంగీతం అంటే పిచ్చి సుబ్బరామన్‌కి. పరిస్థితిని గమనించిన తండ్రి కుంభకోణంలో కర్ణాటక సంగీతం నేర్పించడానికి సిద్ధమయ్యారు. పదేళ్ల శిక్షణ అనంతరం మద్రాసు చేరి పియానో నేర్చుకున్నారు.**

- భరద్వాజ రంగవర్జుల

### చెంచులక్ష్మితో స్టార్ట్ :

హెచ్ఎమ్వీలో హార్మోనియం ప్లేయర్ గా జీవితం ప్రారంభించారు. 1943లో అంటే 22 ఏళ్ల వయసులో చిన్నయ్య, సాలూరి రాజేశ్వర్రావులతో కలిసి తమిళనాడు టాకీసు వారి చెంచులక్ష్మి సినిమాకు సంగీతం అందించారు. అందులో రెండు పాటలు కంపోజ్ చేసే అవకాశం దక్కింది. ఇక వెనక్కు తిరిగి చూడలేదు.

### నేపథ్య సంగీతమే హైలైట్ :

చెంచులక్ష్మిలో టైటిల్స్ పడేటప్పుడు ఆయన విపించిన నేపథ్య సంగీతం కూడా బోల్డు పాపులార్టీ సాధించింది. కేవలం ఆ సంగీతమే ప్రత్యేకంగా రికార్డుగా విడుదలై విజయవంతమైంది. బాలరాజు చిత్రానికి గాలి పెంచల నరసింహారావుతో కల్సి సంగీత దర్శకత్వం వహించారు సుబ్బరామన్. అందులో ఓ బాలరాజా అంటూ ఎస్.వరలక్ష్మి ఆలపించిన పాట సుబ్బరామన్ కంపోజ్ చేసిందే.

### లైలామజ్నూకు ప్రాణం :

సుబ్బరామన్ సినీ సంగీత ప్రపంచంలో కాలూనుకుంటున్న వేళల్లోనే ఘంటసాల ప్రవేశం జరిగింది. భానుమతి స్వీయ నిర్మాణంలో తెరకెక్కిన లైలామజ్నూకు సుబ్బరామనే స్వరకర్త. అందులో పయనమయే ప్రియతమ, నను మరచిపోకుమా.. అనే ఓ విషాదగీతాన్ని ఘంటసాలతో పాడించారు. పాటలోని భావాన్ని ప్రేక్షకుల హృదయాలకు గురి పెట్టే గాయకుడుగా ఘంటసాలకు ఆ పాట చాలా పాపులార్టీ తెచ్చింది.

### సముద్రాల ప్రోత్సాహం:

తెలుగు సినిమాలకు సంబంధించి సుబ్బరామన్ కు చాలా ప్రోత్సాహాన్ని అందించారు సముద్రాల రాఘవాచార్య. ప్రొడక్షన్ మేనేజర్‌గా పనిచేసి భరణీ నుంచి బయటకు వచ్చిన డి.ఎల్. నారాయణ, సముద్రాల, డైరక్టర్ వేదాంతం రాఘవయ్యలతో కల్సి దేవదాసు చిత్ర నిర్మాణంలో పాలుపంచుకున్నారు.

### భానుమతి అభిమానం:

సుబ్బరామన్ సంగీతాన్ని విపరీతంగా ఇష్టపడ్డ వారిలో భానుమతి ఒకరు. తను స్వయంగా సంగీతజ్ఞురాలు కావడంతో సుబ్బరామన్ సంగీతంలోని గొప్పతనాన్ని అర్థం చేసుకున్నారు భానుమతి. తను దర్శకత్వం వహించిన చండీరాణికి కూడా సుబ్బరామన్నే సంగీత దర్శకుడిగా తీసుకున్నారు. అయితే ఎమ్ఎస్ విశ్వనాథన్ కంప్లీట్ చేశారు. అందులో ఘంటసాల, భానుమతి పాడిన ఓ తారకా పాట ఇప్పుడు విన్నా కొత్తగానే అనిపిస్తుంది. అది ఎమ్మెస్వీ చేసిన పాటే.

### కొత్తవాళ్లకు ప్రోత్సాహం:

రావు బాలసరస్వతి, పిఠాపురం నాగేశ్వర రావు లాంటి అప్పటి యువ గాయనీ గాయకులను ప్రోత్సహించారు సుబ్బరామన్. అంతే కాదు తన దగ్గర ఖాళీ ఉన్నా లేకపోయినా ఎవరైనా ఓ వాయిద్యకారుడు వస్తే అతన్ని నిరుత్సాహపరిచేవారు కాదు. అలా ఎందరికో సినిమా మార్గంలో జీవనయానానికి అవసరమైన ఆదరువు చూపించారు సుబ్బరామన్.

### దేవదాసు స్వరకర్త:

భరణీ కాంపౌండ్ నుంచి బయటకు వచ్చిన డి.ఎల్. వేదాంతం, సముద్రాలతో కల్సి చేపట్టిన దేవదాసు ప్రాజెక్ట్ కోసం చాలా కష్టపడ్డారు సుబ్బరామన్. నిజానికి అప్పటికే ఆయన నలభై చిత్రాలకు మ్యూజిక్ కంపోజరు. చండీరాణికి సంగీతం అందిస్తున్న సందర్భంలోనే దేవదాసు ఐడియా ప్రారంభమైంది. దేవదాసులో జగమేమాయ తప్ప దాదాపు అన్ని పాటలకూ సుబ్బరామనే స్వరాలు అందించారు.

### అర్ధంతరంగా మరణం:

దేవదాసు చిత్రం పూర్తి చేయకుండానే సుబ్బరామన్‌కు నూరేళ్లూ నిండాయి. అప్పటికి ఆయన వయసు ముప్పై ఒక్కటి. చిన్నప్పట్నించి ఉన్న ఫిట్స్ రోగమే ఆయన్ను తీసుకెళ్లిపోయింది అంటారు. కాదు హత్యే అనేవాళ్లూ లేకపోలేదు. అప్పటికి ఆయన చండీరాణి, దేవదాసు, బ్రతుకు తెరువు చిత్రాలు చేస్తున్నారు. వీటిలో మొదటి రెండు చిత్రాల బాధ్యత సుబ్బరామన్ శిష్యుడు ఎమ్.ఎస్.విశ్వనాథన్ వహించారు. బ్రతుకు తెరువు మాత్రం ఘంటసాల పూర్తి చేశారు.

### ఘంటసాలతో గొడవలు :

దేవదాసు సమయంలో ఘంటసాలకూ సుబ్బరామన్ కూ ఏవో విబేదాలొచ్చాయట. దీంతో వేరే గాయకుడితో ప్రయత్నించారు కూడా. భావం పలకకపోవడంతో మళ్లీ ఘంటసాలతోనే కంటిన్యూ అయ్యారు. సుబ్బరామన్ అంటే ఘంటసాలకు చాలా గౌరవం. తాను స్వయంగా అప్పటికే సంగీత దర్శకుడుగా పాపులర్ అయి ఉండీ, కావాలని సుబ్బరామన్ దగ్గర అసిస్టెంటుగా పనిచేశారు.

### గురుభక్తి :

సుబ్బరామన్ మీదున్న ప్రత్యేక అభిమానంతోనే ఆయన ప్రారంభించిన బ్రతుకు తెరువులో తను చేసిన కంపోజిషన్స్ కూ సుబ్బరామన్ పేరే వేయమన్నారు ఘంటసాల. దేవదాసులో సుబ్బరామన్ వదిలేసిన రెండు పాటల్లో ఒకటి జగమేమాయ. రెండోది ఇంత తెలిసి యుండి ఈ గుణమేలరా అనే క్షేత్రయ్య పదం. ఈ రెండింటినీ విశ్వనాథన్, రామ్మూర్తిల ద్వయం కంప్లీట్ చేసేసింది. అయితే వారిద్దరూ ఎక్కడా ఆ విషయం ప్రత్యేకంగా చెప్పుకోకపోవడం గురువు మీద వారికున్న భక్తికి నిదర్శనం.

### శంకర్ ఆయన తమ్ముడే :

సుబ్బరామన్ జీవించింది చాలా తక్కువ సంవత్సరాలే. అంతా కలిపి ముప్పై రెండేళ్ల జీవితంలో ఆయన చేసిన కృషి మాత్రం అసామాన్యం. తమిళనాట పాపులర్ అయిన శంకర్ గణేష్ సంగీత ద్వయంలో శంకర్ స్వయానా సుబ్బరామన్ తమ్ముడే. సంగీత దర్శకుడుగా బిజీగా ఉంటూనే చిత్రనిర్మాణంలోకి దిగిన సుబ్బరామన్ ను ఆయన భాగస్వాములే విషప్రయోగం చేయించి చంపించేశారనే అనుమానం ఇండస్ట్రీలో వినిపించేది.

### చంపించింది ఓ మహిళేనా:

సుబ్బరామన్ తో వివాహేతర సంబంధం ఉన్న ఓ మహిళకు కూడా ఈ హత్యలో భాగం ఉందనేది సుబ్బరామన్ దగ్గర పనిచేసిన అసిస్టెంట్ల కథనం. ఏది ఏమైనా సంగీత దర్శకుడుగా సుబ్బరామన్ దక్షిణాది సినీ సంగీతం మీద వేసిన ముద్ర మాత్రం అసామాన్యం. సుబ్బరామన్, ఎమ్మెల్ వసంత కుమారితో కలిసి పాడిన పాటొకటి ఉంది. పాపులలో పెనుపాపి అంటూ సముద్రాల సీనియర్ రాసిన గీతం అది. కృష్ణన్ డైరక్ట్ చేసిన పెళ్లి కూతురు చిత్రంలో గీతం అది. వినండి.. దొరికితే!!



# అష్టమశని పీడిస్తోందా..?
# ఇదిగో విరుగుడు!!





**ఇంటర్నెట్.. దాన్ని మీరు వాడుతున్నారా? లేదా అది మిమ్మల్ని వాడేస్తోందా?? నేటి సమాజంలో నూటికి తొంబైఐదు మంది ఇంటర్నెట్‌కు బానిసలు.. ఇంటర్నెట్ వారిని వాడేస్తోంది. ఇది మీ కథే కావొచ్చు. ఓపిగ్గా చదవండి...**

**'కాకి ఎగిరిందంటే వార్త కాదు.. కుక్క ఎగిరిందంటే వార్త!' ఇది ఇంటర్నెట్ పూర్వ యుగ సామెత. మొబైల్, లాప్‌టాప్, టాబ్, డెస్క్ టాప్, స్మార్ట్ టీవీ.. ఇంటర్నెట్ లోకి ఎలా వెళ్లినా.. చాలామందికి అది క్రమేపీ అడిక్షన్ అయిపోతుంది.**

**అధః పాతాళానికి ఎనిమిది మెట్లు!**

**1. ఒకటో మెట్టు:**

ఇంటర్నెట్‌లో మీ మనసుకు నచ్చిన విషయాలు చూస్తారు. రీల్స్, సోషల్ మీడియా పోస్టింగ్స్, ఫిలిమ్స్, వీడియో గేమ్స్.. ఇలా వీటిని చూడడం వల్ల డోపామైన్ ఉత్పత్తి అవుతుంది. డోపామైన్ కిక్కు మద్యం లాంటిది. అంత కంటే ఎక్కువ. తొలి రోజుల్లో ఒక పెగ్గు. అటుపై.. డోసు పెంచితే కానీ.. కిక్కు రాదు.

**2. రెండో మెట్టు:**

మొదట్లో వచ్చిన కిక్కు రావాలంటే మరింత సేపు మరింత లోతుగా నెట్‌లోకి వెళుతారు. అంటే ఎక్కువ గంటల పాటు మొబైల్ పరికరాల నుండి వచ్చే నీలి కాంతి కళ్లను తాకుతుంది. దీనివల్ల శరీరంలో మెలటోనిన్ హార్మోన్ ఉత్పత్తి తగ్గిపోతుంది. దీనితో నిద్ర పట్టదు. నిద్ర పట్టకపోవడంతో అలసట, చిరాకు వస్తుంది. ఇమ్యూనిటి చస్తుంది. జలుబు దగ్గు నిత్యకృత్యం అయిపోతుంది. దీనితో మరింత చిరాకు.. అలసట. మెదడు చురుకుతనం కోల్పోతుంది. అంటే ఇంగిత జ్ఞానం సగం చస్తుంది.

**3. మూడో మెట్టు:**

ఈ దశలో ఇంటర్నెట్‌కు మరింత అతుక్కుని పోతారు. ప్రయత్నం లేకుండానే చేయి మొబైల్ పైకి పోతుంది. రీల్స్.. వెబ్ వార్తలు.. వాట్సాప్ పోస్టు.. అదే పని. రోజంతా.. యధాలాపంగా చేయి మొబైల్ పైకి. టకీలా బీరు.. విస్కీ.. బ్రాందీ దశను దాటేస్తే.. టకీలా.. నెట్‌పై కూడా అంతే.. కిక్కు కావాలంటే చిత్ర విచిత్ర వార్తలు చూడాలి. 'షాక్ తింటారు..', 'పిచ్చెక్కి పోతుంది..', "తగలపెట్టేసారు..' లాంటి టాగ్ లైన్స్‌తో.. యూట్యూబ్ వీడియోలు ఇలాంటి వారి కోసమే వస్తాయి. సోషల్ మీడియా అలాగరిథమ్‌తో పని చేస్తుంది.

ఎలాంటి పోస్టు చూస్తారో అలాంటివే... పదే పదే కనిపిస్తాయి. క్రమేపీ సాధారణ విషయాలు ఆసక్తి కలిగించడం మానేస్తాయి. అద్భుత వార్తలకు అలవాటు పడిపోతారు. 'ప్రపంచంలో ఖరీదయిన హెూటల్ ఏదో తెలుసా?' 'అక్కడ ఒక రోజు రూమ్ ఛార్జ్ ఎంతో తెలుసా?' 'లంచ్‌కి అయిదు లక్షలు ఛార్జ్ చేసే హెూటల్స్ పేర్లు తెలుసా?' 'ఆమె కట్టుకొన్న చీర ఖరీదు కేవలం అయిదు కోట్లు..' 'ఆయన జీతం జస్ట్ వెయ్యి కోట్లు.' ఇలాంటి వార్తలకు మీరు అలవాటు పడిపోతారు.

**4. నాలుగో మెట్టు!**

ఇలాంటి వార్తలు ఆత్మ విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. ఆత్మన్యూనతలో సెల్ఫ్ ఎస్టీమ్.. ఐడెంటిటీ క్రైసిస్ దశ. తూ.. దీని.. నాదీ.. ఒక బతుకేనా? 'నా కారు ఖరీదు జస్ట్ పది లక్షలు. ఆయన కారేమో అయిదు కోట్లు.' 'నాది అమీర్పేట్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు. కోకాపేటలో ఎనిమిది బెడ్ రూమ్ స్కై విల్లా అంట. ఏడు కోట్లు.. బతికితే ఆలా బతకాలి.' 'ఉన్నది ఒక లైఫ్. ఇప్పుడు కాకపోతే ఎపుడు ఎంజాయ్ చేస్తాము?' ..ఇవీ ఆలోచనలు.

**5. ఐదో మెట్టు :?**

'లైఫ్ ఎంజాయ్ చెయ్యాలి.. చేస్తే తప్పు లేదు.. చేయకపోతే తప్పు' అని నిర్ధారణకు వచ్చేసారు. దీనితో విలాసాలకు బానిసయిపోతారు. ఆదాయానికి మించి ఖర్చు పెడతారు. అమెరికాకు పోయిన నా కజిన్ ఇలాంటి కారు కొన్నాడు.. ఫేస్బుక్‌లో ఇన్స్టాగ్రామ్‌లో ఫొటోలే ఫోటోలు. అప్పు చేసో... దొమ్మీ చేసో.. నేనూ కొనాలి. అంతకు పది రేట్ల ఫోజుతో... ఫోటోలు పెట్టాలి. మగాళ్లు మందు పార్టీలలో.. ఆడాళ్లు కిట్టి పార్టీలలో గొప్పలు చెప్పుకోవడం మొదలెడతారు. షో ఆఫ్ ఎక్కువయిపోతుంది.



**6. ఆరో మెట్టు:**

ఆదాయానికంటే ఖర్చులు ఎక్కువయిపోతాయి. క్రెడిట్ కార్డు అప్పులు.. తెలిసినవారి దగ్గర చేబదులు.

**7. ఏడో మెట్టు**

నూటికి డెబ్బై మంది ఈ దశలో ఉన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక పరిస్థితి. పాత అప్పులు కట్టడానికి కొత్త అప్పులు చెయ్యాలి. అప్పుల ఊబి. ఇప్పుడు తెలిసినవారు అప్పు ఇవ్వడం మానేస్తారు. దీనితో ఆన్లైన్ క్రెడిట్ బాట పడతారు. అప్పులు ఎలా తీర్చాలి? 'ఫలానావాడికి బెట్టింగ్‌లో పది కోట్లు వచ్చాయంట' అనే వార్తలు అప్పుడు వినిపిస్తాయి. వినిపించేలా చేస్తారు. అదే మేజిక్. పేకాట మనవాళ్లకు ఎప్పటి నుంచో అలవాటే. అక్కడ కనీసం సాటి మనుషులు.' 'ఇక చాల్లేరా'.. అని లేపుతారు. ఇప్పుడేమో చైనా వాడి ఆన్లైన్ బెట్టింగ్.. లేదా ఇంకో మాఫియా గాడు. మనిషి చచ్చి పొతే కిడ్నీలు అమ్ముకోవచ్చులే అనికొనే మాఫియా. బెట్టింగ్‌లో ఓడుతున్నా.. అప్పు పక్కనే పుడుతుంది.

**8. ఎనిమిదో దశ:**

ఇదే అష్టమ శని దశ. ఆన్లైన్ బెట్టింగ్ మాఫియా.. క్రెడిట్ మాఫియా.. ఇంటికొస్తారు. భార్యని, చెల్లిని లాక్కుని వెళ్లిపోతారు. తెలిసిన వారికి ఫోన్‌లు చేసి బూతులు తిడతారు. ఈ స్థాయి చేరుకొన్న వ్యక్తి.. క్రమేపీ బంధువులకు, మిత్రులకు దూరమై ఉంటాడు. ఒంటరితనం.. ఆదరించేవాడుండడు. కనీసం ఓదార్పు దక్కదు. జీవితం శూన్యం.. అప్పుడు ఒకటే మార్గం.. డెడ్ ఎండ్! చచ్చిపోవాలి. లేదా నమ్మినవాళ్లను చంపి ఆస్తి లాక్కొని అప్పు తీర్చాలి. ఇది కథ కాదు.. నేటి వ్యధ! ఇంటింటా.. ఊరూరా జరుగుతున్నదే. ఒక్కసారి చెక్ చేసుకోండి. బెట్టింగ్‌కు... ఆన్లైన్ అప్పులకు గత సంవత్సర కాలంలో ఎన్ని కుటుంబాలు బలైపోయాయో..

**పరిష్కారం :**

ఇంటర్నెట్ బానిసత్వం నుండి బయటకు రండి. నా పేరు వాసిరెడ్డి అమర్నాథ్. నేను ఇంటర్‌నెట్ వాడుతున్నాను. ఇంటర్నెట్ ద్వారానే సమాజానికి ఎంతో కొంత మేలు చేసే ప్రయత్నం చేస్తున్నాను. కానీ మీలో చాలామందితో సమస్య ఏమిటంటే.. మీరు ఇంటర్‌నెట్‌ను వాడడం లేదు. మొబైల్.. లాప్‌టాప్.. స్మార్ట్ టీవీ.. ఇంటర్నెట్ మిమ్మల్ని వాడేస్తోంది. నాకు.. ఇంటర్నెట్ వెలుగులు ప్రసరింపచేసే సాధనం! చాలామందికి అది ఒక చీకటి ప్రపంచం! తెలుగు రాష్ట్రాల్లో అధిక జనాభాపైన చెప్పిన... నాలుగు... ఐదో దశను దాటేసారు.

**నేను గుర్తున్నానా?**

కరోనా కాలంలో అంబులెన్సు సైరెన్‌లు.. అర్ధరాత్రి అపరాత్రి అని తేడా లేకుండా విన్పిస్తున్న వేళ.. ఏదో వాట్సాప్ గ్రూప్‌లో భరోసా ఇస్తూ నా పోస్టు.. ఒకటో రెండో చూసి ఉంటారు. బాగా గుర్తుకు తెచ్చుకోండి. మీరు నాకేమీ కారు. అయినా మీకు నేనున్నాను.. మీ నుంచి నేను ఏమీ ఆశించను. కరోనా కాలంలో నా ప్రతి పోస్ట్ ఒక వాక్యంతో ముగించేవాడిని. సర్వేజనా సుఖినోభవంతు. 'అందరూ బాగుండాలి. అప్పుడే మనం ఉంటాము' అని నమ్మినవాడిని. నాదో పెద్ద కుటుంబం. వేలాది పిల్లలు. వారు బాగుండాలంటే సమాజం ఎంతోకొంత బాగుపడాలి. అదే నా ప్రయత్నం.

మీరు విలాసాల బానిసయితే అది వారికి బిజినెస్.. ఊరూరా మద్యం దుకాణాలు.. పబ్బులు.. గంజాయి.. గుట్కా. మీ ఆరోగ్యం పాడయితే అదీ బిజినెస్.. ఐదేళ్లలో వందల రెట్లు పెరిగిన ఫార్మసురుల ఆస్తులు.. సందుసందునా సంతాన సాఫల్య కేంద్రాలు.. డయాగ్నొస్టిక్ సెంటర్లు. స్ట్రెస్.. డిప్రెషన్.. మెంటల్ డిజార్డర్ వస్తే.. అదీ పండగే.. పుట్టగొడుగుల్లా మానసిక చికిత్సాలయాలు. మెడికల్ ఇన్సూరెన్సు.. ఇమ్యూనిటి తగ్గి రోగం వస్తే.. వైబ్రేషన్ డివైస్ బిజినెస్. తిని లావెక్కితే.. డబ్బాల్లో హెర్బల్ మందులు. అది తిని కిడ్నీలు పొతే... అదీ బిజినెస్.

ఆన్లైన్ బెట్టింగ్ పెద్ద మాఫియా బిజినెస్. ఆన్లైన్ క్రెడిట్ ఇంకా పెద్ద బిజినెస్. పుట్టుక బిజినెస్.. చావు ఒక బిజినెస్. బిజినెస్ అంటే నాణ్యమయిన సర్వీస్ అందించడం కాదు.. తీసుకొన్న రూపాయికి న్యాయం చేసే బిజినెస్ కాదు. నిలువు దోపిడీ! ముందు దగా.. వెనుక దగా.. కుడి ఎడమల దగా దగా!

టెక్నాలజీని... మీ బానిస చేసుకోవాలన్నా.. అడిక్షన్ నుంచి బయటపడాలన్నా.. కృత్రిమ మేధ యుగంలో మీ బిడ్డకు ఉద్యోగం రావాలన్నా.. క్రిటికల్ థింకింగ్ అవసరం. ఉడతా భక్తిగా నేను తోడుంటా! మీరు చేయవలసిందల్లా నా ఫేస్బుక్ పోస్ట్‌లను ఫాలో కావడం. మరో మాట! నా పోస్ట్‌లు ఇష్టం లేనివారు జస్ట్ బ్లాక్ చేసేయండి. ఈర్ష.. అసూయ.. ఒంటికి.. ఇంటికి.. మంచిది కాదు. లైఫ్ చాలా సింపుల్. ఈ పోస్ట్‌ను మీరు ఇష్టపడే వారితో షేర్ చేసుకోండి. మంచిని నిలపెడితే అది మనల్ని నిలపెడుతుంది.

✍ అమర్నాథ్ వాసిరెడ్డి

---

## ఘనంగా పింగళి వెంకయ్య జయంతి



(సత్యంన్యూస్, లావేరు)

భారత జాతీయ పతాక రూపకర్త, తెలుగు జాతి కీర్తి కెరటం పింగళి వెంకయ్య జయంతి కార్యక్రమం శనివారం లావేరు శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత పింగళి చిత్రపటానికి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ జాతీయోద్యమంలోనే కాకుండా విద్య, శాస్త్రీయ రంగాలలో కూడా దేశానికి సేవలు అందించిన పింగళి బహుముఖ సేవలను ప్రతి విద్యార్థి తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పింగళి జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థికి ప్రథమ బహుమతిని గ్రంథాలయాధికారి అందజేశారు. ఈ కార్యక్రమంలో లిటిల్ స్కూల్ కరస్పాండెంట్ నీలిమ, ప్రిన్సిపాల్ బాలరాజు, గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 'తల్లికి వందనం' సమస్యకు పరిష్కారం

**- వేరేవారి అకౌంట్‌లో పడిన సొమ్ము అప్పగింత -**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సాంకేతిక సమస్యల వలన ఏవీఎన్ఎం స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న సొనాయిల భరణికి రావాల్సిన తల్లికి వందనం నిధులు రూ.13వేలు మురిపాల హైమావతి అకౌంట్లో జమయ్యాయి. దీంతో గ్రామపెద్దలు, పాఠశాల కమిటీ సభ్యుల సహకారంతో తల్లికి వందనం నిధులను తిరిగి సొనాయిల భరణి తల్లి అయిన సొనాయిల ఉషకు అందజేశారు. ఈ సమస్యను పరిష్కరించడంలో చొరవ చూపిన గ్రామపెద్దలు అంధవరపు ప్రసాద్, సంతోష్, మళ్లా కల్యాణ చక్రవర్తి సోదరులు, కరగాన భాస్కరావు సోదరులు, పార్నంది విజయ కుమార్, మురళీకృష్ణ మాస్టారు, నాగేశ్వరావు మాస్టారు, సచివాలయం సిబ్బందికి భరణి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



# వైకాపాకు మహిళల పట్ల గౌరవం లేదు

**- పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష -**

(సత్యంన్యూస్, పలాస)



వైకాపాకు మహిళల పట్ల గౌరవం లేదని మరోమారు నిరూపితమైందని ఎమ్మెల్యే గౌతు శిరీష ఆరోపించారు. స్థానికంగా శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డిని జగన్మోహన్ రెడ్డి పరామర్శించడాన్ని తప్పు పట్టారు. మహిళలపై సోషల్‌మీడియాలో వ్యక్తిత్వ హననానికి వైకాపా నేతలు పాల్పడుతున్నారని ఆరోపించారు. వైకాపా పాలనలో రాష్ట్రంలో చేసిన అభివృద్ధి ఏమిటని ప్రశ్నించారు. వైకాపా నాయకులు ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయారన్నారు. ఫోన్‌లో అత్యంత జుగుప్సాకరంగా మాట్లాడిన అంబటి రాంబాబు, అవంతి శ్రీనివాస్‌లకు మంత్రి పదవులిచ్చిన ఘనత వైకాపాదేనన్నారు. వైకాపా నాయకులు వ్యవహార శైలితో ఆ పార్టీలో ఉన్న మహిళానాయకులు అంతా తలదించుకోవాలని వ్యాఖ్యానించారు. సొంత చెల్లి షర్మిళ పసుపు చీర కట్టుకుందని ఆమెపై జగన్ అక్కసుతో వ్యవహరించారని విమర్శించారు. అసెంబ్లీలో భువనేశ్వరిపై వైకాపా నాయకులు అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మాజీ సీఎం జగన్ సతీమణి భారతిరెడ్డిపై పరుష పదజాలంతో మాట్లాడిన టీడీపీ కార్యకర్తను చంద్రబాబు జైలుకు పంపించిన విషయాన్ని గుర్తు చేశారు. మహిళలపై వైకాపా ఐదేళ్ల పాలనలో చేసిన అరాచకాలు ఎప్పటికీ మర్చిపోలేమని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను మహిళా లోకం సహించదన్నారు.

## శ్రీముఖలింగానికి స్వాగతద్వారాలకు జేసీ హామీ



(సత్యంన్యూస్, నరసన్నపేట)

దక్షిణకాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగేశ్వర ఆలయానికి రెండు వైపులా స్వాగత ముఖద్వారాలకు ప్రస్తుత జేసీ స్పందించడంపై ఆలయ ప్రధాన అర్చకుడు నాయుడుగారి రాజశేఖర్ హర్షం తెలిపారు. గత 20 ఏళ్లుగా ప్రస్తుత ప్రభుత్వం, గత ప్రభుత్వాల మంత్రులకు, ఎమ్మెల్యేలకు విన్నవించినా రూ.20 లక్షల బడ్జెట్‌తో నిర్మించాల్సిన ఆలయానికి రెండు వైపులా స్వాగతం ద్వారాలకు బడ్జెట్ లేదంటూ జడ్పీ నిధులతో శంకుస్థాపనలు చేయడం, పని మొదలుపెట్టకపోవడంతో దీనిపై జేసీ దృష్టికి రెండుసార్లు తీసుకువెళ్లామన్నారు. జాయింట్ కలెక్టర్ స్పందించి, కలెక్టర్ లోకల్ ఏరియా డెవలప్మెంట్ నిధులతో మంజూరు తప్పకుండా చేస్తానని చెప్పటంపై హర్షం వ్యక్తం చేశారు. కనీసం ఈ వార్షిక సంవత్సరంలోనైనా ముఖద్వారాల నిర్మాణం జరుగుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఎమ్మెల్సీ దువ్వాడకు నోటీసులు

(సత్యంన్యూస్, టెక్కలి)



ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు హిరమండలం పోలీసులు నోటీసులు అందించి విచారణకు రావాలని సూచించారు. శనివారం దువ్వాడను ఆయన క్యాంపు కార్యాలయంలో ఏఎస్ఐ నోటీసులు అందించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 24న ఒక చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'ఎన్నికల ముందు ప్రశ్నించటానికే వచ్చానని చెప్పుకున్న ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు దగ్గర నెలకి రూ.50 కోట్లు తీసుకొని ఇప్పుడు పూర్తిగా ప్రశ్నించడం లేదని విమర్శలు చేశారు. దీనిపై హిరమం డలం మండలం చొర్లంగికి చెందిన జనసేన నాయకులు వంజరాపు సింహాచలం మార్చి 8న ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై హిరమండలం పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం. 21/2025, 353(2), 351(2), బీఎన్ఎస్, 67 ఐటీ యాక్ట్ సెక్షన్లపై కేసు నమోదు చేశారు. దీనిపై దువ్వాడకు 35(3) నోటీసును అందజేశారు.





వజ్రపుకొత్తూరు మండలం పాతటెక్కలి గ్రామంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రైతులకు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో, ఏడీ, ఎంపీడీవో, తహసీల్దార్‌లు, ఏవో, ఏపీవోలు, నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

**- సత్యంన్యూస్, పలాస**

## పేదల కష్టాల తొలగించే పథకమే
# 'ఎన్టీఆర్ భరోసా'



★18వ డివిజన్ ఇన్‌ఛార్జి గోవిందరావు
★కొత్తగా మంజూరైన పెన్షన్లు పంపిణీ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్రంలో నిరుపేదలు, ముఖ్యంగా వృద్ధులు, వితంతువులు ఎదుర్కొంటున్న కష్టాలను తొలగించేందుకు టీడీపీ హయాంలోనే దివంగత నందమూరి తారక రామారావు తొలిసారిగా పింఛన్లు ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. 18వ డివిజన్ ఇన్‌ఛార్జి చవిటిపల్లి గోవిందరావు అన్నారు. డివిజన్ పరిధిలో కొత్తగా మంజూరైన పెన్షన్లను ఆయన శుక్రవారం సచివాలయ సిబ్బందితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు గత ప్రభుత్వంలో అందించిన రూ.3వేలు పింఛనును ఒక్కసారిగా వెయ్యి రూపాయలు పెంచిన రూ.4వేలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అందిస్తున్నారని తెలిపారు. అర్హత ఉండి ఇప్పటి వరకు పింఛను పొందని లబ్ధిదారులకు కొత్తగా మంజూరుచేసిన పింఛన్లను సచివాలయ అధికారులతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


కంచిపట్టు
(5000లకు పైగా డిజైన్స్)
ధర్మవరం పట్టు
(2500లకు పైగా డిజైన్స్)
మంగళగిరి పట్టు
(5000లకు పైగా డిజైన్స్)
ఉప్పాడ పట్టు
(2500లకు పైగా డిజైన్స్)
బెనారస్ పట్టు
(2500లకు పైగా డిజైన్స్)
కుబేర పట్టు
(5000లకు పైగా డిజైన్స్)
ఆర్‌గంజి పట్టు
(2000లకు పైగా డిజైన్స్)
కేటలాక్ శారీస్
(2000లకు పైగా డిజైన్స్)
శ్రావణ వైభవం
శ్రావణం ఫెస్టివల్ ఆఫర్
అన్ని ఆషాఢం ధరలకే
రూ.5000/- షాపింగ్ చేయండి..
వెండి కాయిన్ పొందండి.
శ్రీ వారాహి సిల్క్స్
కృష్ణాపార్క్ దగ్గర, పాలకొండ రోడ్డు, శ్రీకాకుళం


BOOK NOW
SERENE
WOODS
మా ప్రత్యేకతలు
2వేల మంది ఒకేసారి భోజనం చేసేవిధంగా డైనింగ్ హాల్
అతి పెద్ద కల్యాణ వేదిక
అతి పెద్ద స్విమ్మింగ్ పూల్
బాక్స్ క్రికెట్
ఎగ్జిక్యూటివ్ అండ్ సూట్ రూమ్స్
హైజినిక్ కిచెన్
హైజినిక్ ఫుడ్ అవైలబుల్
అతి పెద్ద బ్లాంకెట్ హాల్
కిట్టీ, బర్త్‌డే పార్టీలకు ప్రత్యేకమైన సౌకర్యం
ప్రత్యేకమైన ప్రీమియం
మినీ థియేటర్
శ్రీకాకుళం నగరానికి 5 కిలోమీటర్ల దూరంలో..
అధునాతన హంగులతో అందరికీ అందుబాటు ధరల్లో
SERENE WOODS
SERENE WOODS
CONVENTIONS
ఉదయ్‌కిరణ్: 91009 34455, 91600 93335
కింతలిమిల్లు జంక్షన్ దగ్గర

# స్వాజ్ పింఛన్ల పంపిణీ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



17వ డివిజన్ లో నూతనంగా మంజూరైన స్వాజ్ పింఛన్లను ఆ డివిజన్ ఇన్‌చార్జ్ బస్వా రాజేష్ రెడ్డి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పింఛన్ల పంపిణీతో లబ్దిదారులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో చంద్ర బాబు నాయకత్వంలో, స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ మార్గదర్శ కత్వంతో ఎటువంటి కక్ష సాధిం పులు లేని పాలన సాగుతుందన్నారు. అర్హత ఉంటే చాలని, అందరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తామని తెలి పారు. కార్యక్రమంలో నాయకులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## కమిటీ పిలుపును విజయవంతం చేద్దాం

(సత్యం న్యూస్, శ్రీకాకుళం)

ఈ నెల 5 నుంచి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్వహించ తల పెట్టిన రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్య క్షులు శిమ్మ సోమేశ్వరరావు పిలుపిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా స్థాయి సమావేశం శనివారం స్థానిక మండల పరిషత్ సమా వేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సోమేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపుతో చేపడుతున్న కార్య క్రమానికి సంఘం ప్రతినిధులు వారి అభిప్రాయాలను తెలియజేసి విజయవంతం చేయడానికి తీర్మాణించి నట్టు తెలిపారు. సంఘంకు శాశ్వతభవన నిర్మాణంకు నిధులు సేకరించాలని తీర్మాణం చేసినట్టు వివరించారు. ఉద్యోగులకు ప్రభుత్వ నుంచి అందాల్సిన ప్రయోజనా ల బకాయిలపై చర్చించి వాటిని కరపత్రాలు రూపంలో రూపొం దించి ప్రజాప్రతినిధులకు ఇవ్వాలని తీర్మాణించినట్టు తెలిపారు. వీటి తోపాటు అనేక అంశాలను చర్చించి తీర్మాణాలు అమోదించినట్టు వివరించారు. కార్యక్రమంలో జీవీ రమణారావు, కె.నర్సంహమూ ర్తి, విక్రం తదితరులు పాల్గొన్నారు.



## జైహింద్ పింగళి వెంకయ్య జైహింద్ కవిత ఆవిష్కరణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

భారతదేశజాతీయ పతాకం రూపొందించిన పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా బలగలో శాంతి మందిరంలో ఉన్న గాంధీ పార్కులో పింగళి వెంకయ్య విగ్రహం వద్ద సాహిత్యం చైతన్య కిరణాలు అధ్యక్షులు భోగెల ఉమామహేశ్వరరావు రచించిన" జైహింద్ పింగళి వెంకయ్య జైహింద్ “కవిత” బ్రోచర్‌ను శ్రీకాకుళం ఎమ్మెల్యే సతీమణి గొండు స్వాతి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ కొంక్యాన వేణుగోపాల్, శ్రీకాకుళం లయన్స్‌క్లబ్ సెంట్రల్ నూతన అధ్యక్షురాలు డాక్టర్ పైడి సింధూర, ఇంటాక్ ప్రతినిధి వావిలపల్లి జగన్నాథం నాయు డు,, ప్రముఖ వక్త జామి భీమశంకర్, హర్షవల్లి లయన్స్ క్లబ్ ప్రతి నిధి హారిక ప్రసాద్, పెంకి చైతన్య, నక్క శంకర్రావు, శాస్త్రి తది తరులు పాల్గొన్నారు.



## రైతులను ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

(సత్యంన్యూస్, నరసన్నపేట)

రైతులను అన్ని విధాల ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. శనివారం పోలాకి మండలం మబగాంలో జరిగిన అన్నదాత సుఖీభవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో మొదటి విడతలో రూ.7వేలు జమ చేస్తున్నామన్నారు. పోలాకి మండలంలో 8651 మంది రైతులకు 6 కోట్ల 95 లక్షల 92 వేల రూపాయలు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి సమన్వయకర్త బగ్గు అర్చన, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణన్నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు మిరియాపల్లి వెంక టప్పలనాయుడు, పోలాకి పీఏసీఎస్ చైర్మన్ భైరి భాస్కరరావు, సూరపు నారాయణదాసు, కాయ రవి, ధర్మాన అమ్మన్నాయుడు, ఎంపీడీవో, వ్యవ సాయ శాఖ ఏడిఎల్ వెంకట మధు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రసాద్, తహసిల్దార్ శ్రీనివాసరావు, ఏవో చిరంజీవి, సచివాలయం సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



# మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని,సే నో టూ డ్రగ్స్ అని ప్రముఖ సినీనటి నిధి అగర్వాల్ పిలుపునిచ్చారు. శని వారం ప్రముఖ సినీనటి నిధి అగర్వాల్ శ్రీకాకుళం జిల్లాకు విచ్చేసిన సందర్భంగా శ్రీకాకుళం జిల్లా ఎస్పీ శ్రీ కె.వి మహేశ్వర రెడ్డి ఆదేశాలు మేరకు జిల్లాలో మత్తు పదార్థాలు వలన నివారణ, నియంత్రణ చర్యలలో భాగంగా శ్రీకాకుళం, జి.టి. రోడ్డులో జిల్లా పోలీసు శాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పట్టణ డీఎస్పీ సి హెచ్ వివేకానంద ఆధ్వర్యంలో డ్రగ్స్‌రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి, డీజీపి ఉత్తర్వులు మేరకు, జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఆదేశాలు మేరకు ప్రత్యేకంగా ప్రచురించిన మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్ధాలు గురించి తెలిపే లిడ్రగ్స్ వద్దు బ్రో మరియు సంకల్పం, శక్తీ యాప్,నారీ శక్తీలి అనే పోస్టర్లును సినీ నటి నిధి అగర్వాల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగానికి యువత దూరంగా ఉండాలని పిలుపు నిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా యువత మత్తు పదార్థాలు వినియోగానికి బారిన పడి విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, మీ యొక్క విలువైన జీవితం సమాజం కోసం, తల్లిదండ్రుల కోసం ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. మత్తుకు బానిసై తే జీవితం చిత్త వుతుందని ప్రతి ఒక్కరు గుర్తించాలని కోరారు. జిల్లా పోలీసు యం త్రాంగం మాదక ద్రవ్యాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారని కావున యువత చెడు అలవా ట్లకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మాదకద్రవ్యాల రహిత జిల్లా, రాష్ట్రం తీర్చిదిద్దట్లులో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని కోరారు.సామాజిక బాధ్యతతో అంతర్గత భద్రత, ప్రజా రక్షణ కొరకు రాత్రి పగలు విధులు నిర్వర్తిస్తున్న పోలీసు వారికి పూర్తి సహాయ సహకారాలు అందించి, సమాజంలో డ్రగ్స్‌ను తరిమికొట్టాలని, మత్తు పదార్థాలకు స్వస్తి పలకాలని పిలుపునిచ్చి యువతతో సే నో టూ డ్రగ్స్ మరియు డ్రగ్స్ వద్దు బ్రో, అని నిధి అగర్వాల్ పలికించారు.




# రైతులేనిదే ప్రపంచ మనుగడలేదు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రైతులేనిదే ప్రపంచ మనుగడలేదని, రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని శ్రీకాకుళం నియోజకవర్గ టీడీపీ మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతి శంకర్ అన్నారు. శ్రీకాకుళం రూరల్ మండ లం కళ్లేపల్లి గ్రామంలో అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని ముఖ్య అతి థిగా పాల్గొని ప్రారంభించి మాట్లాడుతూ ప్రపంచానికి రైతే రాజని, సూపర్ 6 హామీల్లో ఒకటైన 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని ప్రారంభిం చడం ఆనందంగా ఉందన్నారు. ఏడాదికి రూ.20 వేలు 3 విడతల్లో రైతుకు అందించనున్నారని, చెప్పిన మాట ప్రకారం మొదటి విడతగా రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేలు, కేంద్రం రూ.2వేలు కలుపుకుని రూ.7 వేలు రైతుల ఖాతాల్లో వేశామన్నారు. ఎవరికైనా సందేహాలుంటే కాల్‌సెంటర్‌ను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. 155251 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి పరిష్కారం పొందవచ్చన్నారు. తెలుగు దేశం జెండాలో నాగలి గుర్తు ఉంటుందని, మన ప్రతి ఎజెండా రైతు సంక్షేమమే ధ్యేయంగా ఉంటుందని, అన్నదాతతోనే దేశ ప్రగతి సాధ్యం అని నమ్మిన పార్టీ తెలుగుదేశమన్నారు. ధాన్యం డబ్బుల కోసం ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితి నాటి ప్రభుత్వం తీసుకొచ్చిం దని, మన ప్రభుత్వం వచ్చాక 48 గంటల్లోనే ధాన్యం డబ్బులు



చెల్లిస్తున్నామని, వైకాపా హయాంలో చెల్లించని రూ.1,674 కోట్ల బకాయిలను కూడా ప్రస్తుత కూటమి ప్రభుత్వమే చెల్లించిందన్నారు ప్రజలకు కూటమి ప్రభుత్వంపై విశ్వాసం పెరుగుతోందని, చరిత్రలో ఎప్పుడు లేని విధంగా 18ఏళ్ల తర్వాత జూలై నెలలలోనే ప్రాజెక్టులు నీటితో కళకళలాడుతున్నాయన్నారు. ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, కౌలురైతుల సంక్షేమానికి ప్రాధా న్యతనిస్తూ వారి జీవితాలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా రూ.3,826 కోట్లు పంట రుణాలుగా మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో రూరల్ మండల అధ్యక్ష బృందం, టీడీపీ నాయకులు, స్థానిక గ్రామాధికారులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

## భక్తుల సౌకర్యాల మెరుగుదలకు కృషి చేయండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

భగవాన్ సత్యసాయిబాబా శతజయంతి సందర్భంగా వచ్చే భక్తు లకు సౌకర్యాలను మెరుగుపరిచే విధంగా కృషి చేయాలని శ్రీ సత్య సాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షులు ఆర్.లక్ష్మణరావు కోరారు. ఈమే రకు శనివారం కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అశ్వనీ వైష్ణవ్‌లను కలిసి వినతిపత్రం అందజేశారు. వేలాది సంఖ్యలో వచ్చే భక్తుల సౌకర్యార్థం రాకపోకలకు సౌకర్యంగా ఉండటానికి ప్రశాంతి నిలయానికి(పుట్టపర్తి) ప్రత్యేక రైళ్లు నడపాలని కోరారు. శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేసి, మరిన్ని ఆధునిక సదుపాయా లు కల్పించాలన్నారు. ప్రత్యేక రైళ్లు ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్‌లో ఆగే విధంగా, మరికొన్ని రైళ్లను ప్రశాంతి నిలయం మీదుగా మళ్లించాలని కోరారు. వీటికి స్పందించిన రైల్వేమంత్రి అశ్వనీ వైష్ణవ్ భారత రైల్వే లకు చెందిన అన్ని జనరల్ మేనేజర్లను తక్షణమే మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారన్నారు. అంతేకాకుండా తాను కూడా స్వయంగా ప్రశాంతి నిలయానికి వచ్చి భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శతజ యంతి వేడుకల్లో పాల్గొంటానని చెప్పారన్నారు. ఆంధ్రప్రదేశ్‌కి సంబంధించి కొన్ని రూట్లలో ప్రత్యేక రైళ్లు వేయాలని కోరారు. అల్లూరి సీతా రామరాజు జిల్లాకు చెందిన సుమారు 4వేల మంది గిరిజన భక్తుల ప్రయాణం సులభతరం చేయడానికి, జనరల్ స్లీపర్ కోచ్‌లతో మాత్ర మే రైళ్లు పెంపు చేయవలసిందిగా కోరారు. అదే విధంగా శ్రీకాకుళం నుంచి ప్రశాంతి నిలయానికి నవంబర్ 20, 21 తేదీల్లో ప్రత్యేక రైళ్లు నడపాలన్నారు. మన రాష్ట్రం నుండి సుమారు 20వేల మంది సత్య సాయి భక్తులు ఈ పవిత్ర యాత్రను ప్రధానంగా రైలుమార్గం ద్వారా పుట్ట పర్తి చేరనున్నారన్నారు.




# పొర్లు దండాలు పెట్టి వినూత్నంగా ధర్నా

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపో కార్మికుల ఉపాధిని దెబ్బతీయవద్దని సిఐటి యు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.అమ్మన్నాయుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీసి టెక్కలిలో మరో మద్యం డిపో ఏర్పాటుకు ఇచ్చిన ఉత్తర్వులను వెంట నే రద్దు చేయాలని, కార్మికుల ఉపాధి కాపాడాలని కోరుతూ ఏపీ బేవ రేజ్ కార్పొరేషన్ ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపో వద్ద సిఐటియు ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా ఆందోళన చేస్తున్న హమాలీలు శనివారం పొర్లు దండాలు పెట్టి వినూత్నంగా ధర్నా నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఎచ్చెర్ల గ్రామంలో దళిత కుటుంబాలు నుండి జాతీయ రహదారి ప్రక్కన కోట్లాది రూపాయలు విలువ చేసే 4 ఎకరాలు భూమిని ఎటువంటి నష్టపరిహారం ఇవ్వకుండా ఉద్యో గాలు కల్పిస్తామని చెప్పి రాష్ట్ర ప్రభుత్వం తీసుకొని ఎచ్చెర్లలో బాటి లింగ్ యూనిట్ ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వం భూములిచ్చిన దళిత కుటుంబాలు కార్మికులుగా, హమాలీలుగా అప్పటి నుంచి ఇప్పుడు 80మంది లోడింగ్, అన్ లోడింగ్ పనులు పనిచేస్తూ రోజు వారీ వచ్చే ఆదాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాయని అన్నా రు. ఉమ్మడి జిల్లాలో ఒక డిపో ద్వారా కొనసాగుతున్న దాన్ని విడగొట్టి ఇప్పుడు కొత్తగా టెక్కలిలో మరో డిపో ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదని అన్నారు.ఎచ్చెర్లలో ప్రభుత్వ సొంత గోడౌన్ ద్వారా మద్యం సరఫరా చేస్తుంటే అదనంగా టెక్కలిలో మరో ప్రైవేట్ గోడౌన్ అద్దెకు తీసుకొని ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం అన్యాయమని విమర్శించారు. దీని వలన టెక్కలిలో గోడా న్‌కు ప్రభుత్వం అద్దె చెల్లించాలని, అదనపు సిబ్బందిని నియమిం చాలని నెలకు లక్షలాది రూపాయలు ప్రభుత్వంపై అదనపు భారం పడుతుందన్నారు. మరో వైపున ఎచ్చెర్ల డిపో పైనే ఆధారపడిన ఉపా



ధి పొందుతున్న 80 దళిత, పేద కుటుంబాలకు చెందిన హమా లీలకు తగినంత ఆదాయం లేక కార్మికుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆవేదన వ్యక్తం చేశారు. కింజరాపు అచ్చెన్నాయుడు వ్యవసాయ శాఖా మంత్రిగా జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తికి, రైతులను ఆదుకోవడానికి చర్యలు తీసుకోవాలి గానీ భూములిచ్చిన కార్మికుల ఉపాధి దెబ్బతీసేలా వ్యవహరించవద్దని విజ్ఞప్తి చేశారు. ఎచ్చెర్ల ఐయంఎల్ డిపోను విడదీసి టెక్కలి మండలం తిర్లంగి గ్రామంలో అదనంగా మరో మద్యం డిపో ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు వెంటనే రద్దు చేసి ఎచ్చెర్ల డిపోను యధావిధిగా కొనసాగించి దళితులు, పేదలుగా ఉన్న హమాలీల ఉపాధిని కాపాడే విధంగా రాష్ట్ర ప్రభు త్వం చర్యలు తీసుకోవాలని కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపో హమాలీస్ యూని యన్ నాయకులు టి.రామారావు, ఎం.సురేష్, బోనెల రాము, లింగా ల రాము, జి.గురుమూర్తి, పి.రామారావు, ఎల్.సీతారాం, ముద్దాడ రాజు, కె.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

# భగవంత్ కేసరి దృశ్యరూపం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



నటుడు నందమూరి బాల య్య గొప్ప నటనకు దృశ్య రూపం, సమాజానికి ఉప యోగపడే సందేశంతో రూపొం దిన భగవంత్ కేసరి జాతీయ ఉత్తమ తెలుగు చిత్రంగా ఎంపిక కావడం పట్ల జిల్లా నంద మూరి బాలకృష్ణ మోక్షజ్ఞ ఫాన్స్ అధ్యక్షులు మాదారపు వెంకటేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. భగవంత్ కేసరి ఉత్తమ తెలుగు చిత్రంగా ఎంపిక కావడం తెలుగు చలనచిత్ర రంగానికి గొప్ప గౌరవం లభించిం దన్నారు. చిత్ర దర్శ కులు అనిల్ రావి పూడి, నిర్మాత సాహు గారపాటికి ఇతర సాంకేతిక వర్గానికి ధన్య వాదాలు తెలిపారు. బాలయ్య రాజకీయ, సినీ రంగంలో, బసవ తారక క్యాన్సర్ హాస్పిటల్ ద్వారా విశిష్ట సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

## సహాయానికి సాక్ష్యం వెంకటరమణమూర్తి

(సత్యంన్యూస్, నరసన్నపేట)

ఒక వ్యక్తికీ సహాయం చేయాలంటే ముందుండే వ్యక్తి ఆనంత పట్నా యికుని వెంకటరమణమూర్తి అని ఎమ్మెల్యే బగ్గురమణమూర్తి అన్నారు. శనివారం నరసన్నపేట ఒక కళ్యాణమండపంలో జరిగిన పదవీ విం మణ అభినందన సభలో ఆయన ప్రసింగించారు. తనతో 30 సంవ త్సరాలనుండి పరిచయం ఉన్న రమణమూర్తిలో సహాయపడే గుణం గమనించానన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ విధినిర్వహణలో ఉన్నంతధికారుల ప్రశంసలు పొందటంలో, సహాయపడటంలో స్నేహితుల ప్రశంసలు పొందుతూ మంచి మనసున్న వ్యక్తిగా గుర్తింపు పొందారన్నారు. అనం తరం వారిని అతిథులు దుశ్శాలువాతో ఘన సన్మానం చేశారు. కార్య క్రమంలో డి.సి.హెచ్.ఎస్.ఎన్. కళ్యాణబాబు, ఎస్. శ్రీనుబాబు, ఆరంగి మురళీధర్, టీడీపీ నాయకులు జామి వెంకట్రావు, గోందూ సత్య న్నారాయణ, సదాశివుని రాంబాబు, సదాశివుని క్రిష్ణ, గోలివి మోహన్, సదాశివుని కృష్ణభగవాన్, బెహరా పూర్ణ చందరరావు, జయకృష్ణ, గొడబ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## బ్రెయిన్ ట్యూమర్ పేషెంట్‌కి చిరు సాయం

(సత్యంన్యూస్, టెక్కలి)

మండలంలోని తిర్లంగి గ్రామంలో ఇప్పిలి కృష్ణారావు అనే వ్యక్తి గత కొంతకాలంగా బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నాడు. వీళ్లది నిరు పేద కుటుంబం. ఇటీవల మందులు కొనుక్కోవడానికి కూడా ఆర్థిక స్థోమత లేక ఇబ్బంది పడుతున్నారని తెలుసుకున్న టెక్కలి అభయం యువజన సేవా సంఘం సభ్యులైన లాడె అనిల్ స్పందించి తమ వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఆ కుటుంబానికి నెల రోజులకు సరిపడేలా 25కేజీల రైస్, 20రకాల నిత్యవసర వస్తువులతో పాటు, మందుల ఖర్చు నిమిత్తం రూ.5వేలు ఆర్థిక సాయం చేసినట్లు అభయం యువ జన సేవా సంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావు తెలియజేశారు. కార్యక్రమంలో అభయం సేవా సంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాస రావు, సంఘసభ్యులు లాడె అనిల్, యన్.సింహాచలం, రాజేష్ పట్నా యక్ పాల్గొన్నారు.



# ఘనంగా శ్రీకృష్ణ ప్రవచనాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

డాక్టర్ శ్రీనివాస్ పట్నాయక్ చారిటీస్ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టర్ బంగ్లా దరిలో శనివారం శ్రీకృష్ణ ప్రవచనాలు, నగర సంకీర్తన నిర్వ హించారు.ఈ సందర్భంగా శ్రీకృష్ణుని జననం తదితర వివరాలను ప్రవచకులు వివరించారు. ఈనెల 16, 17 తేదీల్లో కృష్ణాష్టమి వేడు కలను ఘనంగా నిర్వహించనున్నామన్నారు. దీనిలో భాగంగా 16న చల్ల కుండ కార్యక్రమం, 17న అష్టమి, ఆదివారం.రోహిణి నక్షత్రంతో వైష్ణవ కృష్ణాష్టమి వస్తుందని ప్రముఖ వైష్ణవులు పన్నీరు అప్పారావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస పట్నాయక్, బగ్గం చిన్నముడు దంపతులు వైష్ణవులు పన్నీర్ అప్పారావుకి ఆర్థిక సహాయాన్ని అంద జేశారు. గోపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం లో ముంజేటి శ్రీనివాస్ స్వప్న, రాజేశ్వరమ్మ తరుణ్ దుర్గారావు, డాక్టర్ వినీలబ్బాయి పట్నాయక్, కర్నేని హరిబాబు తదితరులు పాల్గొన్నారు.





కొన్ని వార్తలు ఎంత వద్దనుకున్నా వెంటాడుతూనే ఉంటాయి. ధర్మస్థలలో బట్టబయలైన సామూహిక ఖననాల కథా అలాంటిదే. ఓ పారిశుధ్య కార్మికుడు చేసిన ఆరోపణలు ఇప్పుడు దేశవ్యాప్తంగా సంచలనం రేపాయి. ఓ పుర్రెను సంచీలో వేసుకుని పోలీస్ స్టేషన్ గడప తొక్కి అతడు వెల్లడించిన విషయాలు పోలీసులనే నివ్వెరపర్చాయి. వెంటనే అక్కడి రాష్ట్ర ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసే స్థాయిలో గగుర్పొడిచిన ఘటన అది.

# ఇప్పుడెన్నో ప్రశ్నలకు సమాధానం లభించాల్సిన స్థలం.. ధర్మస్థల!

అది దక్షిణ కన్నడ జిల్లా.. నేత్రావతీ నదీ ఒడ్డు.. 1995–2014 మధ్య అంటే సుమారు రెండు దశాబ్దాలు.. అత్యాచారాలు, హత్యలకు గురైన అనేక మంది విగతజీవులను ఆ పారిశుధ్య కార్మికుడే ఖననం చేశాడు. అందులో మహిళలు, పాఠశాల విద్యార్థినుల సంఖ్యే ఎక్కువ. పైగా వారి ఖననాన్ని ఎవరి బలవంతంపైనో తాను చేశానని ఆ కార్మికుడు చెప్పిన మాటల వెనుక.. అసలేం జరిగిందా అనే క్యూరియాసిటీని రేకెత్తించిన సంచలనం ధర్మస్థల ఘటన.

11 ఏళ్లుగా సదరు పారిశుధ్య కార్మికుడు రహస్యంగా ఒకింత అపరాధభావంతో.. బాహ్య ప్రపంచానికి చెబితే తననేం చేస్తారోనన్న భయంతోనూ.. పోలీసుల వద్దకు వెళ్లితే ఏమవుతుందోనన్న ఆందోళనతోనూ.. ఓ జీవశ్చవంలాగానే బతికాడు. వివిధ ప్రాంతాల్లో తన ఐడెంటిటీ బయటపడకుండా జీవిస్తూ వచ్చాడు. కానీ, ఆ వెంటాడే నెత్తుటి జ్ఞాపకాల కంటే.. దాన్నుంచి విముక్తే మానసిక శాంతినిస్తుందన్న పశ్చాత్తాపంతో పోలీసుల వద్దకు వెళ్లి ఉన్నదున్నట్టు పూసగుచ్చాడు. ఆ ఖననాల వెనుకుంది శక్తివంతులనీ చెబుతున్నాడు. తాను ఖననం చేసినప్పుడు సదరు మహిళల ముఖాలపై చేసిన యాసిడ్ దాడులు, గొంతులు కోసి చంపడాలు, బట్టలు విప్పి విగతజీవులైన బాలికలు, యూనిఫామ్స్‌లోనూ శవాలై వచ్చిన విద్యార్థినులు.. ఇలా వారిని స్కూల్ బ్యాగ్స్‌తో సహా పాతిపెట్టాల్సి వచ్చిందని వాపోయాడు. 2010లో కల్లెరిలో ఓ పెట్రోల్ బంక్ వద్ద అర్ధనగ్నంగా ఉన్న12 నుంచి 15 ఏళ్ల మధ్యనున్న ఓ స్కూల్ బాలిక అత్యాచారానికి గురై విగతజీవిగా కనిపించింది. ఆమె ఎక్కడైతో పడిపోయిందో అక్కడే గొయ్యి తీసి పాతిపెట్టానని చెప్పాడు సదరు కార్మికుడు. అలా నిరాశ్రయులైనవారితో పాటు, బిచ్చగాళ్ల హత్యలను కూడా తాను చూశానని పేర్కొన్నాడు. అలాంటివారి మృతదేహాలను అటవీప్రాంతాల్లో వేయాలనే ఆదేశాలందేవని.. లేకపోతే, తనను చంపేస్తామని బెదిరించేవారనీ చెబుతున్నాడు. అయితే, పోలీసులకు ఇంతకాలం తర్వాత ఉప్పందించిన ఆ విజిల్ బ్లోయర్ ఎవరనేది అతడి భద్రతాకారణాల దృష్ట్యా, విట్నెస్ ప్రొటెక్ట్ యాక్ట్ కింద రహస్యం. సదరు విజిల్ బ్లోయర్ జూన్ 22వ తారీఖున ముందు న్యాయవాదులైన ఓజస్వీగౌడ, సచిన్ దేశ్ పాండే వంటివారిని ఆశ్రయించాడు. అప్పుడా అడ్వకేట్స్ నుంచి తమ క్లైంట్ దర్యాప్తు అధికారులకు తానెక్కడెక్కడైతే మృతదేహాలను పాతిపెట్టాడో ఆయా ప్రాంతాలకు తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్టు ఓ ప్రెస్ నోట్ రిలీజ్ అయింది. అది కాస్తా వైరల్ గా మారి.. కర్నాటక ప్రభుత్వం సీరియస్ గా తీసుకోవాల్సిన పరిస్థితిని ముందుంచింది. జూలై ప్రారంభంలో సదరు ఫిర్యాదుదారుడు దక్షిణ కన్నడ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ను కలిశాడు. తన దగ్గర ఉన్న ఎముకలు, పుర్రెల వంటి అవశేషాలకు సంబంధించిన ఫోటోగ్రాఫ్స్‌ను ఆయనకు సమర్పించాడు. తనకూ, తన కుటుంబానికీ రక్షణ కల్పించాలనీ కోరాడు. జూలై 4వ తేదీన ధర్మస్థల పోలీస్ స్టేషన్‌లో భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 211 (ఏ) కింద కేసు నమోదైంది. వరుస ఖననాలు, వాటి వెనుక అత్యాచారాలు, హత్యలు, మహిళలు, విద్యార్థినులు.. సుమారు రెండు దశాబ్దాలు అంటే కచ్చితంగా అది దేశం మొత్తం కుదిపేసే పెద్ద నేరం. ఇంతకాలం దాచటమూ నేరమే. కానీ, ఆ ఫిర్యాదుదారుడి భయమో, ఆందోళనో, అయమోయమో.. మొత్తానికి ఇంతకాలానికైనా ఆ భయంకర నిజం బయటకొచ్చింది. సదరు ఫిర్యాదుదారుడి కంప్లైంట్ తో ఇంకొందరు బయటకొచ్చారు. సీబీఐలో రిటైర్డైన స్టెనోగ్రాఫర్, బెంగళూరుకు చెందిన సుజాత భట్.. 2003లో తన బిడ్డ కళాశాల పర్యటనలో భాగంగా ధర్మస్థలకు వెళ్లి కనిపించకుండా పోయిందనే ఆరోపణలు చేశారు. అప్పుడు తాను కంప్లైంట్ చేస్తే అక్కడి పోలీసులు పట్టించుకోలేదనీ, తాను బలవంతం చేస్తే తనను అపహరించి కట్టివేసి కొట్టారనీ ఆమె ఆరోపిస్తోంది. మూడునెలల తర్వాత తాను ఆసుపత్రిలో మేల్కొన్నట్టు చెబుతోంది. ఇప్పుడు రెండు దశాబ్దాల తర్వాత సదరు పారిశుధ్య కార్మికుడి ఫిర్యాదుతో.. ఇప్పుడు సుజాత ఆ ఖననం చేసినవారిలో తన బిడ్డ కూడా ఉందేమోనన్న అనుమానాన్ని వ్యక్తం చేస్తోంది. ఆ అపరిచిత ఫిర్యాదుదారుడి కంప్లైంట్ ఇప్పుడు పలు అనుమానాలకు తావిస్తోంది. రికార్డ్స్ పరిశీలించిన అధికారులకు 1980ల కాలం నుంచి 416 మంది తప్పిపోయిన కేసులు నమోదైనట్టుగా వెల్లడైంది. అలాగే, అవన్నీ అసహజ మరణాలుగా గుర్తించినట్టు అధికారులు చెబుతున్నారు. అందులోనూ మహిళలే ఎక్కువ ఉండటంతో సందేహాలు మరింత బలపడ్డాయి. జూలై 11వ తేదీన సదరు మొదటి ఫిర్యాదుదారుడు బీఎన్ఎస్ సెక్షన్ 183 కింద తన వాంగ్మూలాన్ని బెల్తంగడి కోర్టులో మెజిస్ట్రేట్ ముందు నమోదు చేశాడు. తన దగ్గర ఉన్న అస్థిపంజరాలనూ అప్పగించాడు. అయితే, నిరక్షరాస్యుడైన తమ క్లయింట్ సాక్ష్యం చెప్పే సమయంలో ఆయన తరపు లాయర్లను హాజరుకావడానికి కోర్ట్ అనుమతించకపోవడం ఆ న్యాయవాదులు నిరసనలకు దిగారు.

జూలై 14న ఫిర్యాదుదారుడి తరపు న్యాయవాదులు దర్యాప్తుపై నీలినీడలు కమ్ముకున్నట్టు సుప్రీంకోర్ట్ ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. విజిల్ బ్లోయర్ ఐడెంటిటీ బయటకు రాకుండా కాపాడాల్సి ఉండగా.. ఇప్పటికే యూట్యూబ్ ఛానల్స్ లో మొత్తం వివరాలతో సోషల్ మీడియాలో వైరలవుతున్నట్టు ఆ లేఖలో అడ్వకేట్స్ పేర్కొన్నారు. ఓ యూట్యూబ్ వీడియో సాక్షి వాంగ్మూలానికి సంబంధించిన ప్రత్యేకమైన వివరాలు కూడా ఎలా బయటకొస్తాయని ప్రశ్నిస్తూ.. దర్యాప్తు జరుగుతున్న తీరుపై అనుమానాలను వ్యక్తం చేశారు. ఇలాంటి లీక్స్ ఫిర్యాదుదారుడు భయపడ్డంత పనిచేస్తాయని.. అతడి ప్రాణాలకే ముప్పు పొంచి ఉందని.. పోలీసుల తటస్థతపైనా తమకు అనుమానమున్నట్టు వెల్లడించారు. కేవలం న్యాయవాదులే కాదు.. సదరు ఫిర్యాదుదారుడు కూడా సుప్రీంకోర్ట్ న్యాయమూర్తికి తన రక్షణపై భయాన్ని వెల్లడిస్తూ లేఖ రాయడంతో.. ధర్మస్థల ఖననాల కేసులో ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ మరింత పెరిగింది. అదే విధంగా పౌరసమాజ స్పందన తీవ్రత కూడా ఇంతింతై.. హక్కుల సంఘాలు రోడ్డెక్కే పరిస్థితులకు దారితీసింది. దీంతో కర్నాటక ప్రభుత్వం సీరియస్ ఇష్యూగా తీసుకోవాల్సిన తప్పనిసరి అవసరం ఏర్పడింది. కర్నాటక రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ నాగలక్ష్మి చౌదరి కూడా ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు లేఖ రాశారు. దీంతో జూలై 19వ తేదీన కర్నాటక సర్కార్ డీజీపీ ప్రణబ్ మొహంతి నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేసింది. డీఐజీ ఎం.ఎన్. అనుచేత్, సౌమ్యలత, జితేంద్రకుమర్ దయామా సభ్యులుగా ఉన్న బృందం జూలై 25న దర్యాప్తు ప్రారంభించింది. స్థానిక పోలీసుల నుంచి కేసుకు సంబంధించిన ఫైళ్లను స్వాధీనం చేసుకుని.. జూలై 27న ఫిర్యాదుదారుడి వాంగ్మూలాన్నీ నమోదు చేశారు.

ఆ తర్వాత దర్యాప్తులో భాగంగా నేత్రావతీ నదీ అటవీ ప్రాంతంలో శ్మశానవాటికల్లో తవ్వకాలు ప్రారంభమయ్యాయి. రెవెన్యూ, అటవీ, భూసర్వే అధికారుల సమక్షంలో సిట్.. గట్టి బందోబస్తు మధ్య సమాధుల తవ్వకాలను మొదలుపెట్టింది. మొదట ఐదుచోట్ల తవ్వినా ఏ ఆనవాళ్లూ బయటపడలేదు. కానీ, నిన్న జూలై 31న కొన్ని ఎముకలు బయటపడ్డాయి. అదో పురుషుడికి సంబంధించిన ఎముకలుగా గుర్తించారు. విరిగిన పుర్రెముక్కలతో సహా అవశేషాలను స్వాధీనపర్చుకుని ఫోరెన్సిక్ పరీక్షలకు పంపారు.

ఈ ప్రక్రియ ఎక్కడా లీక్ కాకుండా తననొక్కడినే వ్యక్తిగతంగా తాను చూపించే స్థలాలకు తీసుకెళ్లాలని ఫిర్యాదుదారుడు ముందే పట్టుబట్టాడు. సాక్ష్యాలను తారుమారు చేస్తారనే అనుమానం ఇంకా కూడా ఫిర్యాదుదారుడితో పాటు, ఆయనవైపు వాదనలు వినిపిస్తున్న అడ్వకేట్స్ లో ఉంది. తడినేల కావడంతో సవాళ్లతో తవ్వకాలు చేపట్టాల్సిన పరిస్థితులెదురైతున్నాయి. ఈ క్రమంలో సిట్ అధికారులు రాడార్ సాయంతో అన్వేషణ కొనసాగిస్తున్నారు.

ఈ కేసులో అంతమంది అత్యాచారాలు, హత్యల వెనుక ఎవరున్నారు.. రహస్యంగా అంతమందిని ఖననాలు ఎందుకు చేశారు.. అధికార గర్వంతో చేసిందా.. కులాహంకారంతో జరిగిందా కామంతో కళ్లు మూసుకుపోయి జరిగిందా.. ఇలా ఎన్నో ప్రశ్నలు ఇప్పుడు ధర్మస్థల ఘటనలో సరైన సమాధానం కోసం ఎదురుచూస్తున్నాయి. మరోవైపు మొదటి ఫిర్యాదుదారుడితో పాటు.. సుజాత భట్ వంటి రిటైర్డ్ మహిళలు కూడా గళం వినిపిస్తుండటంతో ఈ కేసు ఇప్పుడు దేశాన్నే ఊపేస్తోంది. కర్నాటక సర్కారుకు సవాల్‌గా మారింది.

మొత్తంగా ఇప్పుడు సమాధులను తవ్వి అవశేషాలను బయటకు తీసి చనిపోయినావారెవరో గుర్తించడమే కాదు.. మానవ మృతదేహాలతో పాటు, పాతిపెట్టబడిన సత్యాన్ని బయటకు తీసి దోషులెంతటి వారైనా శిక్షలు పడేలా దర్యాప్తు కొనసాగించడమే ఈ కేసులో సాధించగల్గే విజయం.

ఈమధ్యే మళ్లీ బయటకొచ్చిన ఐర్లాండ్ ఆర్ఫాన్స్ హోంలో జరిగిన శిశువుల రహస్య ఖననాల గురించీ తెలిసిందే. ఈ మధ్యే బిచ్చగాళ్లతో వ్యాపారం చేసే కుబేర వంటి సినిమానూ చూసి ఉంటాం. ఇదిగో ఇప్పుడు మన దేశంలో అలాంటి క్రైం థ్రిల్లర్ ను తలపించే భయంకర ఘటనే తాజాగా తెరపైకొచ్చిన ధర్మస్థల ఉదంతం.

- బాతాఖానీ.కామ్ సౌజన్యంతో...

# సైబర్ నేరాలపై అవగాహన ప్రతి ఒక్కరిలోనూ ఉండాలి




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రతీ ఒక్కరికి విద్యార్థిస్థాయి నుండే ఆర్థిక అక్షరాస్యతపై సైబర్ నేరాలపై అవగాహన ఉండాలని, చదువుకునే విద్యార్థులు వాళ్ళ తల్లిదండ్రులను జాగృతం చెయ్యాలని రణస్థలంలోని పీపీఆర్ కౌముది కళాశాలలో జరిగిన డిపాజిటర్ల విద్యా, అవగాహన నిధి, జనసురక్ష కార్యక్రమంలో బాగంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ పైడి రాజా, రణస్థలం ఎస్సై చిరంజీవి, రణస్థలం బ్యాంకు మేనేజర్ గౌతమ్, సీఎల్ఎఫ్ ప్రతినిధులు, విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు . పైడి రాజా మాట్లాడుతూ వికసిత్ భారత్–2047 సాధ్యపడాలంటే అందులో విద్యార్థుల పాత్ర కీలకమన్నారు. ఎస్సై చిరంజీవి మాట్లాడుతూ పిల్లలు మొబైల్‌లో అనవసరమైన వాట జోలికి పోకుండా చదువు పై దృష్టి సారించాలన్నారు. పేదవాడిగా పుట్టడం మన తప్పు కాదని, పేదవాడి ఉండిపోవడం మన తప్పు అన్నారు. విద్య దానిని మారుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్థిక అక్షరాస్యతపై పుస్తకం విడుదల చేశారు. దాంతో పాటు విద్యార్థులకు సరిఫికేట్స్ అందచేశారు.

'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

# జిల్లా కారాగారం ఆకస్మిక తనిఖీ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్–కం–జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా సూచనలతో, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు శుక్రవారం స్థానిక అంపోలులో గల జిల్లా కారాగారాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో భాగంగా ముద్దాయిల కేసుల వివరాలు అడిగి తెలుసుకొని, ఆరోగ్యం, ఆహారం, పరిశుభ్రత వంటి అంశాలపై సమీక్ష చేశారు. న్యాయవాదిని నియమించుకోలేని ముద్దాయిల నుంచి దరఖాస్తులు స్వీకరించి, వారికి న్యాయ సహాయాన్ని కల్పించేందుకు చర్యలు తీసకుంటామని హామీ ఇచ్చారు. జైలు అధికారులతో కలసి ఆహార సరఫరా, నాణ్యత తదితర అంశాలను పరిశీలించారు. ముద్దాయిలకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలని అధికారులకు సూచించారు. ముద్దాయిలతో ముచ్చటిస్తూ, వారు సత్ప్రవర్తన పాటించి శిక్ష పూర్తయిన తరువాత సమాజంలో సానుకూల మార్పులకు దోహదపడేలా మెలగాలని పిలుపునిచ్చారు. ఈ తనిఖీ కార్యక్రమంలో జైలర్ దివాకర్‌నాయుడు, జైలు సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.



# డైమండ్ జూబిలీ వేడుకలకు శ్రీకారం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం జిల్లా ఏర్పడి 75ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆగస్టు 13 నుంచి 15 వరకు మూడు రోజులపాటు జరిగే డైమండ్ జూబిలీ వేడుకలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నామని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో కలిసి ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా పురోగతిని ప్రతిబింబించేలా ప్రతి కార్యక్రమాన్ని రూపొందించాలని, ప్రజలంతా పాల్గొనాలనిపించేలా ఉత్సవాలు ఉండాలన్నారు. ఆగస్టు 13న ఉదయం 10 గంటలకు మున్సిపల్ హైస్కూల్ మైదానంలో వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. 1950 నుంచి 2025 వరకు జిల్లాలో చోటు చేసుకున్న అభివృద్ధిని ఆవిష్కరించే సాంస్కృతిక ప్రదర్శనలు, నాయకుల ప్రసంగాలు ఉంటాయన్నారు. సాయంత్రం 4 నుంచి 7.30 వరకు ఆర్ట్స్ కాలేజీ రోడ్ నుంచి 7 రోడ్ల జంక్షన్ వరకూ శోభాయాత్ర. ఆదివాసీ తెగల జానపద నృత్యాలు, సంగీతం, వారసత్వ కార్యక్రమాలు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయన్నారు. రాత్రి 6 నుంచి 10 వరకు ఫుడ్ స్టాల్స్. స్థానిక రుచులు, తెగల మిల్లెట్ ఫుడ్, తీరప్రాంత వంటకాలు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ఆగస్టు 14న ఉదయం 8 నుంచి సంప్రదాయ క్రీడల పోటీలు నిర్వహిస్తామన్నారు. 10 నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎస్సే, చిత్రలేఖన పోటీలు ఏర్పాటు చేశామన్నారు. మధ్యాహ్నం 2 నుంచి 6 వరకు ధిమ్సా వంటి జానపద నృత్యాలు, స్వాతంత్ర్య పోరాట ఇతివృత్తాల నాటకాలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 6 గంటలకు ప్రముఖుల సత్కారం ఉంటుందన్నారు. ఆపై రాత్రి 10 వరకు ప్రత్యక్ష వంటల ఫుడ్ ఫెస్టివల్, సాంస్కృతిక సంగీతం ఏర్పాటు చేశామన్నారు. ఆగస్టు 15న ఉదయం 9 నుంచి 12.30 వరకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహిస్తామన్నారు. జెండా ఆవిష్కరణ, దేశభక్తి గీతాలు, ముఖ్యమంత్రి ప్రతినిధి ప్రసంగం ఉంటుందన్నారు. డైమండ్ జూబిలీ సందర్భంగా ప్రత్యేక పతాకం ఆవిష్కరణ నిర్వహిస్తామన్నారు. వేడుకల సందర్భంగా శ్రీకాకుళం నగరాన్ని ప్రత్యేకంగా అలంకరించనున్నామన్నారు. అరసవల్లి సూర్యదేవాలయం, రైల్వేస్టేషన్, జాతీయ రహదారి కూడళ్లను ఎల్ఈడీ లైట్లతో, పుష్పాలతో అందంగా ముస్తాబు చేయనున్నట్టు వెల్లడించారు. ఈ అలంకరణలు వారంరోజులపాటు ఉంటాయన్నారు.

### పంద్రాగస్టు వేడుకలకు సిద్ధంగా ఉండండి

స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన నేతృత్వంలో వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈనెల 15న ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగే వేడుకలు విశిష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి శాఖ కూడా తమ విభాగానికి సంబంధించిన ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వ సేవల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన అధికారులకు మాత్రమే అవార్డుల కోసం సిఫార్సులు పంపించాలన్నారు. అవార్డుల గౌరవాన్ని కాపాడేందుకు పేరు ఎంపికలో ఖచ్చితత్వం పాటించాలని, సంబంధిత వివరాలను ఈ నెల 10లోగా పంపించాలని ఆదేశించారు. వేడుకల సందర్భంగా చిన్నారులు, విద్యార్థులలో దేశభక్తి మన్నన పెంచేలా సాంస్కృతిక కార్యక్రమాలు, పాటలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించాలని సూచించారు. ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగించేలా శకటాల ప్రదర్శన, ప్రభుత్వస్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతిశాఖ కూడా తమ విభాగానికి సంబంధించిన ప్రగతి నివేదికలను శనివారం సాయంత్రం వరకు సీపీఓ కార్యాలయానికి అందజేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పనిచేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను
CONTACT
9440001447, 8341163666

# ‘నానో’చ్చేసినా కదా..!





- డ్రోన్ పిచికారీపై అవగాహన కల్పించని వ్యవసాయ శాఖ
- లిక్విడ్ ఎరువుల వాడకం రాదంటున్న రైతులు
- 80 శాతం సబ్సిడీ ఇస్తాం.. డ్రోన్లు కొనుక్కోమంటున్న ప్రభుత్వం
- మూతబడుతున్న రైతుసేవా కేంద్రాలు
- వ్యవసాయమంత్రి జిల్లాలో ప్రైవేటు వ్యాపారులదే హవా

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కెమికల్ ఫెర్టిలైజర్స్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి నానో ఫెర్టిలైజర్స్‌ను ప్రోత్సహించాలన్న ప్రణాళిలో భాగంగా డ్రోన్స్‌తో ఎరువుల పిచికారీని ఈ ఏడాది నుంచి ప్రభుత్వం విస్తృతం చేసింది. అయితే రైతులను మాత్రం అందుకు అనుగుణంగా సన్నద్ధం చేయడంలో పూర్తిగా విఫలమైందనే ఆరోపణలు ఉన్నాయి.

యూరియా కొరత రోజురోజుకు అధికమవుతుంది. కేంద్ర ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కెమికల్ ఫెర్టిలైజర్స్‌ను తగ్గించి లిక్విడ్ (నానో) ఫెర్టిలైజర్స్‌కు ప్రోత్సహించడం వల్ల ఎరువుల దిగుమతి తగ్గిపోయింది. దీనికి తోడు కేంద్రం ఎరువులపై ఇస్తున్న సబ్సిడీని ఏ ఏడాదికా ఏడాది తగ్గిస్తూ నానో ఫెర్టిలైజర్స్ వినియోగానికి ఊతం ఇస్తుంది. ఇందులో భాగంగా నానో ఫెర్టిలైజర్స్ వినియోగాన్ని గణనీయంగా పెంచాలని రాష్ట్ర ప్రభుత్వానికి, మార్క్‌ఫెడ్‌కు కేంద్రం ఇదివరకే ఆదేశాలు జారీచేసింది. దీనికి అనుగుణంగా కేంద్రం ఎరువుల కేటాయింపులు గణనీయంగా రాష్ట్రానికి తగ్గించినట్టు అధికారులు చెబుతున్నారు. ఇందుకు అనుగుణంగా వ్యవసాయశాఖ అధికారులు కెమికల్ ఎరువుల వినియోగం తగ్గించడంపై రైతులకు అవగాహన కలిగించిన దాఖలాలు లేవు. నానో ఫెర్టిలైజర్‌ను అతి తక్కువ ధరకే మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. వీటిని డ్రోన్ సహాయంతోనే పిచికారీ చేయాల్సి ఉంటుంది. చిన్న డబ్బాలో స్ప్రే మాదిరిగా వచ్చే లిక్విడ్‌ను డ్రోన్‌కు అమర్చి పిచికారీ చేస్తే తప్ప దీన్ని రైతులు స్ప్రే చేయలేరు. మార్కెట్‌లో




నానో ఫెర్టిలైజర్స్ అందుబాటులో ఉన్నా రైతులు పిచికారీ చేయలేరు. అలాగని డ్రోన్స్‌ను వినియోగించడం రాదు.

**డ్రోన్లతో పిచికారీ..**

జిల్లాలో కొన్ని మండలాల్లో పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని గ్రామాల్లో డ్రోన్ ద్వారా లిక్విడ్ ఎరువును పిచికారీ చేస్తున్నారు. కొన్నిచోట్ల సాంకేతిక సమస్యలతో పిచికారీ నిలిచిపోతుందని రైతులు చెబుతున్నారు. లిక్విడ్ ఎరువులు వినియోగాన్ని పూర్తిస్థాయిలో పెంచితే డ్రోన్లు వేల సంఖ్యలో అవసరమవుతాయి. డ్రోన్లను సమకూర్చుకొనే అవకాశం అందరు రైతులకు ఉండదు. ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో డ్రోన్లు సమకూరుస్తున్నా చిన్న చిన్న కమతాలున్న రైతులకు ఇవి అనవసర పెట్టుబడే. గ్రామం యూనిట్‌గా డ్రోన్లు సరఫరా చేయాలి. ఇందుకోసం వ్యవసాయాధికారులు, సాంకేతిక సిబ్బంది అవగాహన కల్పించాలి. అలా కాకుండా కెమికల్ ఎరువులు లేవు కాబట్టి నానో వాడండని అంటే.. దాన్ని పొలంలో చల్లే విధానం గుళికల రూపంలో ఉండదు కాబట్టి, పిచికారీకి డ్రోన్లే అవసరముంటుంది. గ్రామానికి ఒకటి రెండు డ్రోన్లు ఉన్నా సాంకేతిక సమస్యలు ఉత్పన్నమైతే సరిచేసే అవకాశం లేదు. దీంతో డ్రోన్ల కోసం ఎదురుచూస్తే మొదటికే మోసం వస్తుందని నానో ఎరువులు స్థానంలో యూరియా, డీఏపీ కోసం రైతు సేవా కేంద్రాలకు రైతులు ఎగబడుతున్నారు. అక్కడా అవసరానికి తగ్గట్టు ఎరువులు అందుబాటులో ఉండడం లేదు. జిల్లాకు కేటాయించిన ఎరువులను రైతులకు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నా అక్కరకు రావడం లేదు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా దమ్ములు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇటీవల కురుస్తున్న ఒక మోస్తారు వర్షాలు కారణంగా వర్షాధార భూముల్లో నాట్లు వేసే ప్రక్రియ ప్రారంభమైంది. ఈ సమయంలో రైతులకు యూరియా అవసరం. దీన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా కూపన్లు ఇచ్చి రైతులకు పంపిణీ చేయాలని నిర్ణయించినా డిమాండ్ మేరకు సరఫరా జరగలేదు. దీంతో ముమ్మరంగా దమ్ములు చేస్తున్న ప్రాంతాలకు ఎరువులు అందుబాటులో ఉన్న ఆర్ఎస్‌కేల నుంచి తరలించి పంపిణీ చేయాలని అధికారులు ఆదేశిస్తున్నా సాంకేతిక సమస్యలు కారణంగా సాధ్యం కావడంలేదు. గ్రామంలోని ఆర్ఎస్‌కే నుంచి ఇతర ప్రాంతాలకు అందుబాటులో ఉన్న ఎరువుల తరలింపును రైతులు అంగీకరించడం లేదు. దీంతో ప్రైవేట్ ఎరువుల డీలర్లు అవకాశంగా తీసుకొని అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

**డిమాండ్ మేరకు సరఫరా లేదు**

జిల్లాలో అన్నిచోట్ల ఇదే పరిస్థితి ఉన్నా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఎక్కువ శాతం వర్షాధార భూములు ఉండడంతో ఎరువుల సమస్య అధికంగా ఉంది. నియోజకవర్గంలో ఖరీఫ్‌కు అందాల్సిన ఎరువులు కనీస స్థాయిలో కూడా సరఫరా చేయలేదని విమర్శలు ఉన్నాయి. ఇచ్ఛాపురం మండలం పరిధిలో 7,800 ఎకరాల్లో వరిపంటకు సుమారు 195 మెట్రిక్ టన్నుల యూరియా, 150 మెట్రిక్ టన్నులు డీఏపీ అవసరమైతే, కేవలం 100 మెట్రిక్ టన్నుల ఎరువులను మాత్రమే అందుబాటులో ఉంచారు. కంచిలిలో 8,500 ఎకరాలకు 200 మెట్రిక్ టన్నులు యూరియా, 120 మెట్రిక్ టన్నులు డీఏపీ అందుబాటులో ఉంచారు. సోంపేటలో 9వేల ఎకరాలకు 200 టన్నుల యూరియా, డీఏపీ అందుబాటులో ఉంచారు. కవిటి మండలంలో 5,500 ఎకరాలకు 175 మెట్రిక్ టన్నుల ఎరువులను అందుబాటులో ఉంచారు. గతంలో రైతు సేవా కేంద్రాలు పరిధిలో రైతులను మ్యాపింగ్ చేసి, ఖరీఫ్ పంటల విస్తీర్ణాన్ని అంచనావేసి ఎరువులు ఇండెంట్‌ను ఇచ్చేవారు. అందుకు అనుగుణంగా ఎరువులను రైతుసేవా కేంద్రాలకు సరఫరా చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. జిల్లాలో ఖరీఫ్ ముందస్తు ప్రణాళిక లేకపోవడం వల్లనే జిల్లాలో ఎరువుల కొరత తీవ్రంగా ఉందని రైతులో ఆందోళన వ్యక్తమవుతుంది. రైతుసేవా కేంద్ర పరిధిలో ఎంతమేర ఎరువులు అవసరం, ఎప్పుడు అవసరం అనే స్పష్టత లేదు. రైతుసేవా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకుడు మాత్రమే అందుబాటులో ఉంటున్నారు. వీరిని పింఛన్ల పంపిణీతో పాటు ఇతర ప్రభుత్వ పథకాలు అమలుకు వినియోగిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. పింఛన్ల పంపిణీ, పథకాలు ప్రచారంలో ఉండడం వల్ల రైతుసేవా కేంద్రాలకు తాళాలు వేయాల్సిన పరిస్థితి. రైతుసేవా కేంద్రాలకు సరఫరా అవుతున్న కొద్దిపాటి ఎరువుల పంపిణిలో స్థానిక నాయకులు ప్రమేయం అధికం కావడం వల్ల రైతులు ఇబ్బంది పడే పరిస్థితి ఎదురవుతోందన్న విమర్శలు ఉన్నాయి.



## సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందుబాటులోకి తీసుకొస్తాం

- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



(సత్యంన్యూస్, అమరావతి)

రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకొస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రకాశం జిల్లా దర్శి మండలం తూర్పు వీరాయపాలెంలో ‘అన్నదాత సుఖీభవ’ పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు. లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన అనంతరం పొలాల వద్ద వినూత్నంగా ఏర్పాటుచేసిన వేదికపై రైతులతో ముఖాముఖి నిర్వహించారు. రైతుల చెప్పిన సమస్యలపై స్పందించిన సీఎం.. వాటిని పరిష్కరించాలని అక్కడి కక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రైతులకు లాభం వచ్చేలా ఏ పంట వేయాలో అధ్యయనం చేసి చెబుతామన్నారు. రైతే రాజుగా మారాలని, ఎన్ని కష్టాలున్నా ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలనేది తన ఆకాంక్ష అన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసినందుకు సంతోషంగా ఉందని, ఎన్నికల ముందు అరాచక, దుర్మార్గపు పాలన నడిచిందని, 2019లో చేసిన తప్పిదం వల్ల ప్రజల భవిష్యత్ అంధకారంలోకి వెళ్లిందన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని జనసేన అధినేత పవన్ కల్యాణ్ మంచి ఉద్దేశంతో ముందుకొచ్చారని, రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా జాతీయ పార్టీ బీజేపీతో పొత్తు పెట్టుకున్నామని చంద్రబాబు తెలిపారు. కేంద్రంలో బీజేపీ నాలుగోసారి కూడా అధికారంలోకి వస్తుందని సీఎం అన్నారు. రాష్ట్రంలోని 46,85,838 మంది రైతులు ‘అన్నదాత సుఖీభవ’ ద్వారా లబ్ధి పొందనున్నట్లు తెలిపారు. మొదటి విడతలో రాష్ట్ర వాటాగా ఒక్కో రైతుకు రూ.5వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేశారు. దీనికి తోడుగా కేంద్రం ‘పీఎం కిసాన్’ పథకం కింద మొదటి విడతగా రూ.2వేల చొప్పున రైతులకు సాయం అందిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ఒక్కో రైతుకు రూ.7 వేలు చొప్పున జమ చేశాయి. ఒక్కో రైతు కుటుంబానికి కేంద్రం సాయంతో కలిపి ఏడాదికి రూ.20 వేలు అందించనున్నారు. మంత్రులు అచ్చెన్నాయుడు, ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మహిళా భద్రతే పోలీసుల మొదటి ప్రాధాన్యత

- జిల్లా ఎస్పీ మహేశ్వర రెడ్డి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



జిల్లావ్యాప్తంగా మహిళాలు భద్రతే మొదటి ప్రాధాన్యత అని ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. సైబర్ మోసాలు, గంజాయి, మద్యం వల్ల కలిగే అనర్ధాలు, అక్రమ రవాణా, రోడ్డు ప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మహిళలు, బాలికలపై జరిగే నేరాలు, చట్టాలు, శిక్షలు, సీసీ కెమెరాలు ఏర్పాటు గురించి ప్రజలకు విస్తృతంగా జిల్లా పోలీసులు అవగాహన కల్పిస్తున్నారని ఎస్పీ తెలిపారు. ఈమేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా పోలీసులు పట్టణ, గ్రామీణ ప్రజలతో, పాఠశాల, కళాశాల విద్యార్థులతో భాగస్వాములయ్యేలా ప్రత్యేక కార్యాచరణ, రూపకల్పనే నారీశక్తి, సంకల్పం కార్యక్రమాల ఉద్దేశమన్నారు. ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా నేరాల బారినపడకుండా సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న దాడులు, గృహ హింస, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, మహిళలు చట్టాలు అయిన ఫోక్సో యాక్ట్, ఇతర చట్టాలు, శక్తి యాప్ అవశ్యకత, బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలు వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు, అనర్థాల గురించి వివరించామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలలో భాగంగా ప్రతిరోజు ఆటో డ్రైవర్లు, ఇతర వాహన చోదకులకు రహదారి భద్రత నియమాలు, అతి వేగం, ట్రిపుల్ డ్రైవింగ్, హెల్మెట్ ధారణ తదితర అంశాలపై అవగాహన కల్పించి రోడ్డు ప్రమాదాలు నివారణకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

## మందలించాల్సిందిపోయి పరామర్శిస్తారా?

- కేసులకు భయపడే గవర్నర్‌ను కలిశారు
- ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై వ్యక్తిత్వ హననానికి పాల్పడే విధంగా మాట్లాడిన మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డిని మందలించాల్సింది పోయి పరామర్శిస్తారా? అంటూ వైకాపా అధినేత జగన్మోహన్‌రెడ్డిపై ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ ఫైరయ్యారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డికి మహిళల పట్ల ఏమాత్రం గౌరవం లేదని, ప్రసన్నకుమార్‌రెడ్డి ఏం సాధించారని పరామర్శకు వెళ్లారని ఆమె ప్రశ్నించారు. నెల్లూరులో జగన్మోహన్‌రెడ్డి పర్యటనకు జనాలు లేకపోతే బంగారుపాల్యంలో పర్యటించిన వీడియోను సాక్షి ఛానల్ టెలికాస్ట్ చేయడం ఏ విలువలకు నిదర్శనమని ఆమె ప్రశ్నించారు. వైకాపా పాలనలో రాష్ట్రాన్ని కొల్లగొట్టిన బ్యాచ్ ఒక్కొక్కరిగా జైలుకు వెళ్తుండటంతో జగన్మోహన్ రెడ్డి దంపతులకు భయం పట్టుకుందని, అందుకే గవర్నర్‌ను కలిశారన్నారు. ఆరోగ్యంగా ఉన్న గవర్నర్‌ను ఇప్పుడు కలవాల్సిన అవసరం



ఏమిటని, తనను అరెస్ట్ చేయాలంటే గవర్నర్ అనుమతి ఉండాలి కాబట్టి ముందుగా ఆయన వద్దకు వెళ్లారని ఆమె ఆరోపించారు. వైకాపా హయాంలో ఇంటిలో ఉన్న మహిళలను సైతం వదలకుండా వైకాపా బ్యాచ్ ట్రోల్ చేసిందని, అదే జగన్ సతీమణి భారతి మీద టీడీపీ నేత పరుషంగా వ్యాఖ్యానిస్తే తమ ప్రభుత్వం కేసు నమోదు చేసి జైలుకు పంపిందని ఆమె గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో జగన్ పాదయాత్ర చేస్తారని చెబుతున్నారని, అది జరిగే పని కాదని, ఆయన జైలుయాత్రకు సిద్ధంగా ఉండాలని గ్రీష్మ అన్నారు.

## తల్లిపాలు బిడ్డలకు ఎంతో ఆరోగ్యం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అప్పుడే పుట్టిన బిడ్డలకు తల్లిపాలు ఎంతో ఆరోగ్యాన్ని ఇస్తాయని, అలాగే పిల్లల్లో వ్యాధినిరోధక శక్తిని పెంచుతుందని శ్రీకాకుళం అర్బన్ ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్ట్ అధికారిణి నాగరాణి అన్నారు. కృష్ణా పార్క్ సెక్టార్ పరిధిలోని బాకర్‌సాహెబ్‌పేట అంగన్వాడీ కేంద్రంలో శనివారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బాలింతలకు పలు సూచనలు చేశారు. పుట్టిన గంటలో బిడ్డలకు తల్లి పాలు ఇవ్వడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని, బిడ్డలకు పాలు ఇవ్వడం వలన తల్లులు రొమ్ము కేన్సర్‌కు దూరంగా ఉంటారని పర్యవేక్షకురాలు పి.సీతామహాలక్ష్మీ తెలిపారు. అనంతరం పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎస్. కె.సర్వీనాబేగం, ఆశా శశి, తెలుగుదేశం నాయకులు లొట్టి సూరిబాబు, ఎం.మన్మధరావు, అంగన్వాడీ కార్యకర్తలు పి.దీప, లక్ష్మీ, కె.నళిని, కె.చిరంజీవి, మంగవేణి, ఎస్.హైమ, సరస్వతి, భానుమతి, వోమాక్షి తదితరులు పాల్గొన్నారు.



## బళ్లారి రాఘవకు నివాళి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అనతి కాలంలోనే రాఘవ న్యాయవాదిగా, ముఖ్యంగా క్రిమినల్ కేసులు వాదించడంలో, ప్రసిద్ధి చెందినట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు వెల్లడించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తాడిపత్రి రాఘవాచార్యులు(బళ్లారి రాఘవ) జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, కలెక్టరేట్ పరిపాలనాధికారి సూర్యనారాయణ, పర్యాటక శాఖ అధికారి నారాయణరావు, సెట్‌శ్రీ ఇన్‌చార్జ్ సిఈఓ, కలెక్టర్ కార్యాలయం అన్ని విభాగాల పర్యవేక్షులు, డిటిలు పాల్గొన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.